మంగళవారం 05.05.2026


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 13 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత పెరగడానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తీసుకున్న సంస్కరణలే కారణం. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, నాణ్యమైన బోధన మెరుగై, విద్యార్థుల భవిష్యత్తుపై నమ్మకం పెరిగి మంచి ఫలితాలు నమోదయ్యాయి.




**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**

# నిరుద్యోగ యువత భవితకు ఎమ్మెల్సీ ఆలపాటి భరోసా







కేంద్ర ప్రభుత్వ శాఖలు మరియు ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగాల కోసం జరుగు పోటీ పరీక్షలకు

## Free Training for SKILL DEVELOPMENT

## "ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ"

[ఇంటర్, డిగ్రీ ఆపైన చదివినవారు అర్హులు]

**BATCH-II**

**Register Now**

రిజిస్ట్రేషన్లు:
**05-05-2026** నుండి

ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష :
**10-05-2026**

శిక్షణ ప్రారంభం:
**13-05-2026**

శిక్షణా స్థలము:
HDFC బ్యాంక్ ప్రక్కన,
లక్ష్మీపురం మెయిన్ రోడ్,
గుంటూరు,

**For Online Entrance Exam**

ప్రవేశ పరీక్ష కొరకు అభ్యర్థులు పైనున్న QR Code ను Scan చేసి రిజిస్ట్రేషన్ చేసుకోగలరు.

సమాచారం కొరకు:
73374 59888  95536 81118

**ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, MLC**
Krishna & Guntur Graduates Constituency
Ex.Minister for Technical Education, A.P.

## మోదీపై విశ్వాసమే బీజేపీకి భారీ విజయం



(మొదటి పేజీ తరువాయి)

అస్సాం, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో బీజేపీకి స్పష్టమైన మెజారిటీ లభించిందని తెలిపారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కూడా పార్టీ ఓటు శాతం గణనీయంగా పెరిగిందన్నారు. అభివృద్ధి, జాతీయ భద్రత, పారదర్శక పాలనకు ప్రజలు మద్దతు తెలపడంతో పాటు కేంద్ర సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు, డిజిటల్ పురోగతికి దేశవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయని పేర్కొన్నారు.

యువత, మహిళలు, రైతులు, మధ్యతరగతి వర్గాల మద్దతే ఈ విజయానికి కీలకమని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి కృషి కొనసాగుతుందని, ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. దేశాభివృద్ధి కోసం అందరూ ఏకమై ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## 'బీజేపీ'మ్యాజిక్ ... పుదుచ్చేరిలో ఎన్‌డీఏ వరుసగా రెండోసారి విజయం



(మొదటి పేజీ తరువాయి)

బాలికలకు ఈ-స్కూటర్లు, స్థానికులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం వంటి అంశాలు ప్రజల్లో సానుకూలతను పెంచాయి. గృహిణులకు ఇచ్చే ఆర్థిక సాయాన్ని పెంచుతామని ప్రకటించడం, మత్స్యకారుల సమస్యల పరిష్కారంపై హామీలు కూడా ప్రభావం చూపాయి.

సీఎం రంగస్వామికి ఉన్న ప్రజాదరణ ఎన్‌డీఏ విజయాన్ని మరింత బలపరిచింది. సాధారణ జీవనశైలి, సంక్షేమ పథకాల అమలు, గ్రామీణ ఓటర్లతో సాన్నిహిత్యం ఆయనకు ప్లస్‌గా మారాయి. విద్యార్థులకు ఆహార పథకాలు, వృద్ధులకు పెన్షన్, రైతులకు మద్దతు వంటి కార్యక్రమాలు ప్రజల్లో మంచి గుర్తింపును తెచ్చాయి.

ఇక కాంగ్రెస్-డీఎంకే కూటమి మరోసారి ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. కూటమిలో అంతర్గత విభేదాలు, బలమైన నాయకత్వం లోపం ప్రతికూలంగా మారినట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. కాంగ్రెస్‌కు కీలక నేతగా ఉన్న వి.నారాయణస్వామి పోటీకి దూరంగా ఉండటం కూడా ప్రభావం చూపింది.

అదే సమయంలో ఇతర పార్టీల ప్రవేశం కారణంగా ప్రతిపక్ష ఓటు విభజన జరగడం ఎన్‌డీఏకు అనుకూలంగా మారింది. ఈ పరిణామాలతో పుదుచ్చేరిలో ఎన్‌డీఏ విజయం సాధించడం సులభమైందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## తమిళనాడులో విజయ్ విజిల్ ప్రభంజనం



(మొదటి పేజీ తరువాయి)

ఒంటరిగా పోటీ చేయడం ఆయన వ్యూహంలో ప్రధాన అంశంగా నిలిచింది. రాజకీయ విశ్లేషణల ప్రకారం, విజయ్ వ్యూహం గతంలో ఎంజీ రామచంద్రన్ అనుసరించిన విధానాన్ని తలపిస్తోందని చెబుతున్నారు. డీఎంకే, ఏఐఏడీఎంకేలకు ప్రత్యామ్నాయంగా కొత్త శక్తిగా టీవీకేను ప్రజల్లో నిలబెట్టడంలో విజయ్ సఫలమయ్యారని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అయితే, పొత్తుల విషయంలో విజయ్ విధానం గత నేతలైన ఎన్‌టీఆర్, ఎంజీఆర్‌లకు భిన్నంగా ఉంది. ఎన్‌టీఆర్, ఎంజీఆర్‌లు తమ తొలి ఎన్నికల్లో మిత్రపక్షాలతో కలిసి పోటీ చేసినప్పటికీ, విజయ్ మాత్రం ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా సింగిల్‌గా బరిలోకి దిగారు. అయినప్పటికీ ఆయన పార్టీ భారీ విజయాన్ని నమోదు చేయడం విశేషంగా నిలిచింది.

తమిళనాడులో దశాబ్దాలుగా కొనసాగుతున్న డీఎంకే, ఏఐఏడీఎంకే ఆధిపత్యానికి టీవీకే గట్టి సవాల్ విసురుతున్న నేపథ్యంలో, విజయ్ విజయాన్ని రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా భావిస్తున్నారు.

## బీజేపీ విజయం 'వికసిత బారత్ 'కు నిదర్శనం



(మొదటి పేజీ తరువాయి)

సంపద సృష్టి కారణంగానే మోదీని బెంగాల్ ప్రజలు ఆశీర్వదించారని సత్యకుమార్ వ్యాఖ్యానించారు. ఒక్కసారి గెలిచిన అనంతరం రెండో సారి గెలవడం అనేది అసంభవంగా ఉండేవాటిని పటాపంచెలు చేస్తూ వరుస పాలనకి ఎన్.డీ.ఏ కూటమి నాంది పలుకుతుందన్నారు. చాలా రాష్ట్రాల్లో ణ్డా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలని నెరవేరుస్తూ వస్తోందని తెలిపారు. అక్రమ చొరబాటులని గుర్తించి వారి వారి దేశాలకి పంపించటం జరుగుతుందని చెప్పారు. డిటెక్ట్, డిలిట్, డిపోర్ట్ నినాదంతో బీజేపీ రాష్ట్రాలని కైవసం చేసుకుంటుందని స్పష్టం చేశారు. ఏ ప్రాంత ప్రజలకి అన్యాయం చేయకుండా సబ్ కా సాత్, సబ్ కా వికాస్ నినాదంతో అభివృద్ధి చేయటం మోదీ నిదర్శనమన్నారు. బీజేపీ సిద్ధాంతలపట్ల ప్రజలకి విశ్వాసం ఉందన్నారు. అస్సాంలోనూ బీజేపీ విజయ దుందుభి మోగించిందని సత్యకుమార్ పేర్కొన్నారు.

# బీజేపీ జెండా ఎగిరింది... మమతా కోట కూలింది !



(మొదటి పేజీ తరువాయి)

సాగిన హోరాహోరీ ప్రచారం పార్టీ సందేశాన్ని మారుమూల గ్రామాలకూ చేర్చింది.

అమిత్ షా ఏప్రిల్‌లో సుమారు 15 రోజులు బెంగాల్ అంతటా పర్యటించారు. బూత్ స్థాయి సంస్థాగత నిర్మాణం బలోపేతం, మహిళలకు నెలకు రూ.3,000 ఆర్థిక సహాయం, ఏటా లక్ష ఉద్యోగాల కల్పన వంటి హామీలు ఓటర్లను ఆకర్షించాయి. రత్న దేబ్నాథ్, రేఖాపాత్ర వంటి మహిళా అభ్యర్థులను నిలబెట్టడం ద్వారా ఆడ ఓటర్ల మనసు గెలుచుకోవడంలో పార్టీ సఫలమైంది.

**సువేందు అధికారి మళ్లీ జయం :** 2021 నందిగ్రాం, ఇప్పుడు 2026 భవానీపూర్ – రెండు సార్లూ మమతను ఓడించిన సువేందు అధికారి బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా పరిగణించబడుతున్నారు. "తదుపరి ముఖ్యమంత్రి బెంగాలీ నేలలో పుట్టినవాడే అవుతారు" అని అమిత్ షా అన్నారు.

**దక్షిణ బెంగాల్ కంచుకోట కూలిపోయింది :** దశాబ్దాలుగా టీఎంసీ అభేద్య కోటగా నిలిచిన దక్షిణ బెంగాల్‌లో బీజేపీ లోతుగా చొచ్చుకుపోయింది. హౌరా, హుగ్లీ, దక్షిణ 24 పరగణాల జిల్లాల్లో ఆ పార్టీ ఆధిక్యాన్ని కోల్పోవడం, ఈ ఎన్నికల ఫలితాన్ని ఏకపక్షంగా మార్చిన ప్రధాన అంశం.

**ఎస్సైర్ వివాదం కేంద్రంగా నిలిచింది :** ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్‌ఎస్‌ఐఆర్)లో 89 లక్షల పేర్ల తొలగింపు ప్రధాన వివాదంగా మారింది. ముస్లిం ఓటర్లను లక్ష్యంగా చేస్తున్నారని టీఎంసీ ఆరోపించింది. పోలింగ్ సమయంలో లక్షలాది ఫిర్యాదులు నమోదయ్యాయి. ఫాల్తా నియోజకవర్గంలో 21వ తేదీన రీపోలింగ్ జరగనుంది.

**బీజేపీ ఎదుగుదల -- దశాబ్దంలోనే అసాధారణ మార్పు :** పశ్చిమ బెంగాల్‌లో ఒకప్పుడు అస్తిత్వమే ప్రశ్నార్థకంగా ఉన్న బీజేపీ, గత పదేళ్లలో అద్భుతమైన ఎదుగుదలను నమోదు చేసింది.

2011లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయిన పార్టీ

2016లో 3 సీట్లు

2021లో 77 సీట్లు

2026లో 206 సీట్లు

ఈ ప్రయాణం పార్టీ వ్యూహాత్మక ప్రణాళిక, కేడర్ బలోపేతం, క్షేత్రస్థాయి శ్రమకు నిదర్శనంగా నిలిచింది.

**పక్కా వ్యూహంతో బీజేపీ పాగా:** బెంగాల్లో అధికారం కోసం బీజేపీ సుదీర్ఘమైన పక్కా వ్యూహంతో ముందుకు సాగింది. బంగ్లాదేశ్ వలసదారుల సమస్యను లేవనెత్తుతూనే రాష్ట్రం వెను కబడటానికి 50 ఏళ్లుగా అధికారంలో ఉన్నవాళ్లే కారణ మని ప్రజలు నమ్మేలా ప్రచారం చేసింది. ఒక్కో అడుగు ముందుకేస్తూ క్షేత్రస్థాయిలో మహిళలు, యువత, కొత్త ఓటర్లు, కార్మికులను తనవైపునకు తిప్పుకుంది. కార్మికులు, డార్జిలింగ్ వంటి కొండప్రాం తాల్లోని తేయాకు కార్మికుల్లో మంచి ఆదరణ సంపా దించింది. ఇందుకోసం బీజేపీ అగ్రనాయకుల నుంచి సాధారణ కార్యకర్త వరకు నిబద్ధతతో కష్టపడి పనిచే శారు. మమత పాలనలో మితిమీరిన అవినీతి, హింస కూడా ప్రజలు బీజేపీవైపు మొగ్గటానికి కారణమైంది. అర్బన్ పార్టీ అని పేరున్న బీజేపీ.. బెంగాల్ గ్రామీణ ప్రాంతాల్లో కూడా బలంగా పాతుకుపోయింది. డబుల్ ఇంజిన్ సర్కారుతో పరిశ్రమలు తెస్తామని కాషాయ పార్టీ చేసిన ప్రచారాన్ని ప్రజలు నమ్మారు. పార్టీ నిర్మాణ పరంగానూబీజేపీ పక్కా వ్యూహంతో ముందు కెళ్లింది. టీఎంసీలో ఏక వ్యక్తి విధానం పాతుకుపోగా, బీజేపీ బూత్ స్థాయి నుంచి బలపడుతూ వచ్చింది. బీజేపీ నేతలు ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసి ఓట్లడిగే వ్యూహాన్ని పక్కాగా అమలు చేశారు. దీంతో బెంగాలీలు ఆ పార్టీకి బంపర్ మెజారిటీ కట్టబెట్టారు.

ఈ ఫలితాలతో బెంగాల్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. బీజేపీ ఇచ్చిన హామీలు, పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, పరిపాలనలో మార్పులు ఎలా ఉంటాయన్నది ఇప్పుడు రాష్ట్ర ప్రజల ముందున్న కీలక ప్రశ్నగా మారింది. 15 ఏళ్ల పాలనకు తెరపడగా, కమలం పాలనపై దేశవ్యాప్తంగా దృష్టి కేంద్రీకృతమైంది.

## నిడదవోలు అభివృద్ధికి 'విజన్' రెడీ:మంత్రి కందుల దుర్గేష్




**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించనున్న తూర్పుగోదావరి జిల్లా సమీక్షా సమావేశం నేపథ్యంలో నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ సన్నద్ధమయ్యారు. సోమవారం నాడు సమిశ్రగూడెం ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ బృందంతో ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, పీ4 కార్యక్రమం పురోగతి, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అమలు స్థితి మరియు కీలక పనితీరు సూచికలుపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అందిన అర్జీలను మంత్రి దుర్గేష్ స్వయంగా పరిశీలించారు. ప్రతి అర్జీని నిర్ణీత సమయంలోగా పరిష్కరించి ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ మరియు ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే కార్యక్రమాల ద్వారానే స్థిరమైన అభివృద్ధి సాధ్యమని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. కీలక పనితీరు సూచికలుపై చర్చలో భాగంగా అభివృద్ధి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. "అభివృద్ధి పనుల్లో పారదర్శకత, సమన్వయం ఉంటేనే ప్రజలకు స్పష్టమైన ఫలితాలు అందుతాయి. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్య సాధనలో CVAPU బృందం కృషి అభినందనీయం. నియోజకవర్గ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళిక, అమలు, మానిటరింగ్‌లో జవాబ్దారీ సమర్థవంతంగా పనిచేస్తోంది. ప్రజా భాగస్వామ్యాన్ని పెంపొందించడం, మార్గదర్శక వ్యవస్థను బలోపేతం చేయడం మరియు విభిన్న విభాగాల మధ్య సమన్వయాన్ని కల్పించడం ద్వారా విజన్ లక్ష్యాల సాధనలో జవాబ్దారీ కీలక పాత్ర పోషిస్తోంది" అని మంత్రి దుర్గేష్ సంబంధిత బృందాన్ని అభినందించారు. అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి, ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి దుర్గేష్ ఆదేశించారు.

సమీక్షా సమావేశంలో భాగంగా నియోజకవర్గంలో కీలక పెండింగ్ పనులపై మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా చర్చించారు. నిడదవోలు నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యలైన కంసాలిపాలెం-మాధవరం బ్రిడ్జి నిర్మాణ పనులు, ఎర్రకాలువ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం, నిడదవోలు - యర్నగూడెం ప్రధాన రహదారి అభివృద్ధి, హేవలాక్ వంతెన అభివృద్ధి, చినకాశీరేవు వంతెన నిర్మాణం తదితర అంశాలను సీఎం చంద్రబాబునాయుడు వద్ద ప్రస్తావించి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ హెడ్ క్వార్టర్ ఎంపీడీవో జగన్నాథరావు, నిడదవోలు తహసీల్దార్ నాగరాజు నాయక్, యంగ్ ప్రొఫెషనల్ సుధీర్ కుమార్ మరియు విజన్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీతోనే కురుబలకు రాజకీయ ప్రాధాన్యం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సీట్లు కేటాయింపు
- దేవస్థాన పాలక మండళ్లలో సభ్యులుగా అవకాశం
- త్వరలో గుడికట్ల పూజారులకు గౌరవ వేతనాలు
- విద్యతోనే కురుబలు శాసించే స్థాయికి... : మంత్రి సవిత
- కుప్పం కోడెళ్ల రాయస్వామి ఉత్సవంలో పాల్గొన్న మంత్రి సవిత
- ఆలయంలో ప్రత్యేక పూజలు



కుప్పం(జర్నలిస్ట్ ఫైల్) : టీడీపీతోనే కురుబలకు రాజకీయ ప్రాధాన్యం లభిస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు పలు దేవస్థాన బోర్డు సభ్యులగానూ కురుబలకు అవకాశమివ్వనున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లా కుప్పం మండలం కేంద్రంలో జరుగుతున్న కోడెళ్ల రాయస్వామి ఉత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, కోడెళ్ల రాయస్వామి ఉత్సవంలో పాల్గొనడం తన అదృష్టమన్నారు. గతేడాది జరిగిన ఉత్సవాల్లో సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పాల్గొన్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. సీఎం చంద్రబాబునాయుడు నిధులు మంజూరు చేసి, ఆలయ అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయల కల్పించారన్నారు. కురుబల తరపున సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

**స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో ప్రాధాన్యం...:** టీడీపీ ఆవిర్భావం నుంచి కురుబలకు రాజకీయ ప్రాధాన్యమిస్తోందని మంత్రి సవిత తెలిపారు. 2014 సాధారణ ఎన్నికల్లోనూ కురుబలకు రెండు ఎంపీలు, ఒక ఎమ్మెల్యేగా సీట్లు ఇచ్చి గెలిపించుకున్నారన్నారు. కురుబ సామాజిక వర్గానికి చెందిన తనకు బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా అవకాశమిచ్చి ప్రోత్సాహిస్తున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కురుబల అధికంగా ఉన్నచోట్ల టీడీపీ తరఫున ఎన్నికల బరిలో దింపనున్నట్లు తెలిపారు. పలు దేవస్థాన బోర్డుల్లోనూ కురుబలకు సభ్యులుగా అవకాశమివ్వనున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. ఇలా అన్నింటా కురుబలకు టీడీపీ ప్రోత్సాహంతో రాజకీయ ప్రాధాన్యం లభిస్తోందన్నారు. గుడికట్ల పూజారులకు త్వరలోనే గౌరవ వేతనాలు అందించనున్నామన్నారు. గుడి కట్ల దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సవిత వెల్లడించారు.

**విద్యతోనే శాసించే స్థాయికి... :** విద్యతోనే అన్ని రంగాల్లోనూ ముందంజ వేయొచ్చునని, శాసించే స్థాయికి చేరుకోవొచ్చునని మంత్రి సవిత తెలిపారు. కురబలు తమ బిడ్డలకు ఉన్నత విద్య చదివించేలా కృషి చేయాలన్నారు. రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థల్లో ఎన్నో సంస్కరణలు తీసుకొస్తున్నారన్నారు. పేదలు, బీసీల విద్య కోసం అధిక నిధులు కేటాయిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో విద్యలో కురుబల రాణించాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత వెంట ఎమ్మెల్సీ శ్రీకాంత్, కురబ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున. ఇతర కురుబ సామాజిక ప్రతినిధులు, వర్గీయులు అదిక సంఖ్యలో ఉన్నారు.

## కేరళంలో 'కమల వికాసం'... బీజేపీ సరికొత్త చరిత్ర

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఎన్నికల్లో నేమోం, చాతన్నూర్, కాళకూటం నియోజకవర్గాల్లో బీజేపీ గెలుపొందింది. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ఒకటి కంటే ఎక్కువ స్థానాల్లో బీజేపీ విజయం సాధించడం ఇదే తొలిసారి. 2016లో నేమోం నుంచి ఒక్క సీటుతో ఖాతా తెరిచిన పార్టీ, 2021లో ఆ సీటును కూడా కోల్పోయి అసెంబ్లీలో ప్రాతినిధ్యం లేకుండా పోయింది. తాజాగా మూడు సీట్లు గెలవడం పార్టీకి కీలక మలుపుగా భావిస్తున్నారు.

కొల్లాం జిల్లాలోని చాతన్నూర్ నియోజకవర్గంలో వామపక్షాల ఆధిపత్యానికి చెక్ పెడుతూ బీజేపీ జెండా ఎగిరింది. పార్టీ అభ్యర్థి బీబీ గోపకుమార్ 4,398 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. గత ఎన్నికల్లో రెండో స్థానానికి పరిమితమైన పార్టీ ఈసారి గెలుపొందడం విశేషంగా నిలిచింది.

నేమోం నియోజకవర్గంలో బీజేపీ మరోసారి తన పట్టు సాధించింది. కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ త్రిముఖ పోరులో విజయం సాధించారు. కమ్యూనిస్ట్ అభ్యర్థి వీ శివంకుట్టిపై 4,978 ఓట్ల తేడాతో గెలుపొందారు.

కాళకూటం నియోజకవర్గంలో బీజేపీకి ఉత్కంఠభరిత విజయం దక్కింది. మాజీ కేంద్ర మంత్రి వీ మురళీధరన్ కేవలం 428 ఓట్ల స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. లెక్కింపు చివరి దశ వరకు ఉత్కంఠ కొనసాగింది.

మొత్తంగా ఈ ఫలితాలు కేరళలో బీజేపీ స్థిరంగా బలపడుతున్న సంకేతాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## బెంగాల్ విజయం చరిత్రాత్మకం

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవలి ఎన్నికల్లో బెంగాల్‌తో పాటు అసోం, పుదుచ్చేరి ప్రాంతాల్లో కూడా ఎన్డీఏ ఖాతాలో విజయాలు నమోదు కావడం గమనార్హమని ఆయన అన్నారు. మహిళా ప్రాతినిధ్యం ఓటింగ్ నుంచి పోటీ వరకూ గణనీయంగా పెరిగిందని, ఇది ప్రజాస్వామ్యానికి శుభసూచికమని అభిప్రాయపడ్డారు.

కాంగ్రెస్, టీఎంసీ పార్టీలపై విమర్శలు గుప్పించిన మోదీ, మహిళా బిల్లును అడ్డుకోవడంపై ప్రజలు వారికి గట్టి సమాధానం ఇచ్చారని అన్నారు. భవిష్యత్‌లో ఇతర పార్టీలకు కూడా ప్రజల తీర్పు స్పష్టంగా ఉంటుందని హెచ్చరించారు.

బీజేపీ విజయోత్సవ సభలో అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ తదితర కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు ఈ విజయం న్యాయం చేసినట్టేనని మోదీ పేర్కొన్నారు.

చివరగా, ఓటు ఎవరికి వేసినా ప్రతి ఓటరికి తాను శిరస్సువంచి నమస్కరిస్తానని, ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమని ప్రధాని పేర్కొన్నారు.

## అసోంలో బీజేపీ హ్యాట్రిక్ విజయం... ఫలించిన మోదీ సేన వ్యూహం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్, ఏఐయూడీఎఫ్ మధ్య పొత్తు లేకపోవడం కూడా బీజేపీకి కలిసొచ్చింది. ఓట్ల చీలిక కారణంగా ప్రతిపక్షం బలహీనపడగా, ఎన్‌డీఏ కూటమి తన ఆధిక్యాన్ని పెంచుకుంది. బీజేపీతో పాటు అసోం గణ పరిషత్, బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ వంటి మిత్రపక్షాల మద్దతు గెలుపులో కీలక పాత్ర పోషించింది.

ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ వ్యక్తిగత ప్రజాదరణ, ప్రభుత్వ పనితీరు కూడా బీజేపీకి బలంగా నిలిచాయి. సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల అభివృద్ధి, అక్రమ వలసలపై కఠిన వైఖరి వంటి అంశాలు ఓటర్లను ఆకర్షించాయి.

బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో అభివృద్ధి, సంస్కృతి, సుస్థిరత అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం కూడా ప్రభావం చూపింది. మహిళా సంక్షేమ పథకాలు, యువతకు ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ఇచ్చిన హామీలు ఓటర్లను ఆకట్టుకున్నాయి.

కేంద్ర-రాష్ట్ర సమన్వయంతో అమలైన 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వ విధానం కూడా ప్రజల్లో సానుకూల స్పందన తెచ్చింది. కేంద్ర నిధులతో మౌలిక వసతుల అభివృద్ధి, రహదారులు, వంతెనలు, పరిశ్రమల ఏర్పాటు వంటి అంశాలు రాష్ట్ర పురోగతికి దోహదపడ్డాయి.

మొత్తం మీద బీజేపీ వ్యూహాలు, మిత్రపక్షాల సహకారం, ప్రభుత్వ పనితీరు సమిష్టిగా పని చేయడంతో అసోంలో కమలదళం మరోసారి విజయం సాధించింది. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం ఈ హ్యాట్రిక్ విజయంతో రాష్ట్రంలో బీజేపీ పట్టు మరింత బలపడింది.

## బెంగాల్‌లో బీజేపీ చారిత్రక విజయం వెనుక మాస్టర్ మైండ్స్



(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యూహాలు కూడా విజయంలో కీలక పాత్ర పోషించాయి. రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ ర్యాలీలు, రోడ్‌షోలు నిర్వహించి 'మిషన్ బెంగాల్' లక్ష్యంతో పార్టీని బూత్ స్థాయి వరకు బలోపేతం చేశారు. ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ స్థాయిలో పర్యవేక్షణ చేపట్టారు.

కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ ఎన్నికల ఇంఛార్జ్‌గా వ్యవహరిస్తూ సంస్థాగత వ్యవహారాలు, అభ్యర్థుల ఎంపిక, కూటమి సమన్వయంలో కీలక పాత్ర పోషించారు. తక్కువ ప్రభావం ఉన్న ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేయడంలో ఆయన కృషి కీలకమైంది.

రాష్ట్ర స్థాయిలో పార్టీ వ్యవహారాలను సమన్వయం చేసిన శామిక్ భట్టాచార్య కూడా గెలుపులో భాగస్వామిగా నిలిచారు. అభ్యర్థుల ఎంపిక నుంచి బూత్ స్థాయి ఏర్పాట్ల వరకు సమర్థంగా వ్యవహరించారు. పార్టీ సందేశాన్ని స్థానిక భాషలో ప్రజల్లోకి చేర్చడంలో కూడా కీలకంగా వ్యవహరించారు.

అదే విధంగా సువేందు అధికారి బీజేపీ విజయానికి ప్రధాన శక్తిగా నిలిచారు. తృణమూల్ కాంగ్రెస్‌లో కీలక నేతగా పనిచేసిన ఆయనకు ఆ పార్టీ బలాబలాలపై అవగాహన ఉండటం బీజేపీకి అనుకూలంగా మారింది. క్షేత్ర స్థాయిలో ప్రచారం, అవినీతి, రాజకీయ హింస అంశాలపై దృష్టి పెట్టడం ద్వారా ఓటర్లను ఆకర్షించారు. నందిగ్రామ్‌లో మమతా బెనర్జీపై విజయం సాధించడం ద్వారా ఆయన ప్రాధాన్యం మరింత పెరిగింది.

ఇలా కేంద్ర నాయకత్వం వ్యూహాలు, రాష్ట్ర నాయకత్వం సమన్వయం, కార్యకర్తల కృషి సమిష్టిగా పని చేయడంతో బీజేపీ పశ్చిమ బెంగాల్‌లో చారిత్రక విజయాన్ని నమోదు చేసింది.



ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత పెరగడానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తీసుకున్న సంస్కరణలే కారణం. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, నాణ్యమైన బోధన మెరుగై, విద్యార్థుల భవిష్యత్తుపై నమ్మకం పెరిగి మంచి ఫలితాలు నమోదయ్యాయి.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



మంగళవారం 05.05.2026


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 13 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# బీజేపీ జెండా ఎగిరింది... మమత కోట కూలింది



- బెంగాల్‌లో బీజేపీ ప్రభంజనం • 206 సీట్లతో బీజేపీ అఖండ విజయం
- మమతా బెనర్జీ పతనం -15 ఏళ్ల తృణమూల్ పాలనకు తెర
- మమత భవానీపూర్‌లో ఓటమి • 20 మంది టీఎంసీ మంత్రులు పరాజయం
- సువేందు అధికారి మరోసారి కింగ్‌మేకర్

**నేషనల్ డెస్క్ (జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీ చరిత్రలో మరపురాని విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు గాను ఏకంగా 206 సీట్లు గెలుచుకుని, 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ పాలనకు సమాధి కట్టింది. 2016లో కేవలం 3 సీట్లకు, 2021లో 77 సీట్లకు పరిమితమైన పార్టీ ఇప్పుడు సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నది.

ఈ ఎన్నికల్లో అత్యంత కీలకమైన పరిణామంగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా ఓటమిపాలైనది. భవానీపూర్ నియోజకవర్గంలో ఆమెను ఎదిరించిన బీజేపీ నేత సువేందు అధికారి మూడోసారి విజయం సాధించారు. గతంలో నందిగ్రాంలో దీదీని ఓడించిన అధికారి, ఇప్పుడు ఆమె సొంత కంచుకోటలోనూ వారి ఆధిపత్యాన్ని సమాప్తం చేశారు.

ఈ ఎన్నికల్లో అత్యంత కీలకమైన పరిణామంగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా ఓటమిపాలైనది. భవానీపూర్ నియోజకవర్గంలో ఆమెను ఎదిరించిన బీజేపీ నేత సువేందు అధికారి మూడోసారి విజయం సాధించారు. గతంలో నందిగ్రాంలో దీదీని ఓడించిన అధికారి, ఇప్పుడు ఆమె సొంత కంచుకోటలోనూ వారి ఆధిపత్యాన్ని సమాప్తం చేశారు.

ఓట్ల శాతం పరంగా చూస్తే, బీజేపీ 45 శాతానికి ఎగబాకగా టీఎంసీ 2021లో నమోదైన 48 శాతం నుండి 41 శాతానికి పడిపోయింది. ఈ ఏడు శాతం తేడా పార్టీకి ప్రాణాంతకంగా మారింది. 2021లో అతి స్వల్ప మెజారిటీతో టీఎంసీ గెలుచుకున్న 16 నియోజకవర్గాల్లో ఈసారి బీజేపీ ఆధిక్యంలో నిలిచింది.

బీజేపీ విజయానికి అనేక అంశాలు దోహదపడ్డాయి. హిందూ ఓట్ల ఏకీకరణ, పదిహేనేళ్ల పాలనపై విసుగు, నిరుద్యోగం, మహిళల భద్రత అనే అంశాలు ప్రచారంలో ప్రధాన పాత్ర పోషించాయి. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల నేతృత్వంలో మిగతా 2లో...

**సీట్ల వివరాలు**

| | |
|---|---|
| బీజేపీ | 206 |
| టీఎంసీ | 81 |
| కాంగ్రెస్ | 2 |
| సీపీఎం | 1 |

**ఓట్ల శాతం**

| | |
|---|---|
| బీజేపీ | 46% |
| టీఎంసీ | 41% |
| సీపీఎం | 4.45% |
| కాంగ్రెస్ | 3% |

**బీజేపీ పయనం**

| | |
|---|---|
| 2016 | 3 సీట్లు |
| 2021 | 77 సీట్లు |
| 2026 | 206 సీట్లు |





## బెంగాల్ విజయం చరిత్రాత్మకం

- ఇది పరివర్తనకు నాంది పలికే సమయం
- ప్రధాని నరేంద్ర మోదీ

2 లో

**నేషనల్ డెస్క్ (జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సాధించిన ఘన విజయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ చారిత్రాత్మకమని అభివర్ణించారు. ఇది ప్రతీకారం తీర్చుకునే దశ కాదని, పరివర్తనకు నాంది పలికే సమయమని స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం బీజేపీ ప్రధాన కార్యాలయంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ఉత్సాహభరితంగా ప్రసంగించారు.

బెంగాల్ ప్రజలు భయాందోళనల దశ నుంచి విముక్తి పొందారని, రాష్ట్రంలో రాజకీయ హింసా సంస్కృతికి ముగింపు పలకాల్సిన అవసరం ఉందని మోదీ పిలుపునిచ్చారు. బీజేపీ కార్యకర్తలు ప్రతీకార భావనకు దూరంగా ఉండి, రాష్ట్ర అభివృద్ధి దిశగా కృషి చేయాలని సూచించారు. "ఇది మార్పు కోసం వచ్చిన తీర్పు" అని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా గంగా ప్రవాహ ప్రాంతాన్ని ప్రస్తావించిన మోదీ, "ఉత్తరాఖండ్‌లోని గంగోత్రి నుంచి పశ్చిమ బెంగాల్‌లోని గంగాసాగర్ వరకు బీజేపీ విజయ యాత్ర పరిపూర్ణమైంది" అని వ్యాఖ్యానించారు. బీహార్ తర్వాత బెంగాల్ కూడా బీజేపీ పాలనలోకి రావడం ద్వారా సుశాసనం ప్రజలకు చేరువవుతుందని తెలిపారు.

## తమిళనాడులో విజయ్ విజిల్ ప్రభంజనం



**నేషనల్ డెస్క్ (జర్నలిస్ట్ ఫైల్) :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో సినీ నటుడు విజయ్ రాజకీయ అరంగేట్రంలోనే సంచలన విజయాన్ని నమోదు చేసినట్లు ఫలితాల ధోరణి సూచిస్తోంది. విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ 'విజిల్' గుర్తుతో సింగిల్‌గా పోటీ చేసి 100కుపైగా స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమైనట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అతి తక్కువ కాలంలోనే విజయ్ పార్టీని రాష్ట్రవ్యాప్తంగా బలపరచడం విశేషంగా నిలిచింది. 2024 ఫిబ్రవరిలో పార్టీ స్థాపన నుంచి ప్రారంభమైన ప్రయాణం, జెండా, సిద్ధాంతాల ప్రకటనతో వేగంగా ముందుకు సాగింది. ఎన్నికలకు మూడు నెలల ముందు గుర్తు కేటాయించినప్పటికీ, పార్టీ అజెండాను ప్రజల్లోకి విస్తృతంగా చేర్చడంలో విజయ్ సఫలమయ్యారు. ఏ కూటమితోనూ పొత్తు లేకుండా అన్ని 234 స్థానాల్లో మిగతా 2లో...

## బెంగాల్‌లో బీజేపీ చారిత్రక విజయం వెనుక మాస్టర్ మైండ్స్



**నేషనల్ డెస్క్ (జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమ బెంగాల్‌లో దాదాపు 15 ఏళ్లుగా కొనసాగుతున్న మమతా బెనర్జీ పాలనకు ముగింపు పలుకుతూ బీజేపీ తొలిసారిగా అధికార పీఠాన్ని అధిరోహించడం రాజకీయంగా చారిత్రక ఘట్టంగా మారింది. ఈ విజయం వెనుక కేంద్ర నాయకత్వం నుంచి బూత్ స్థాయి కార్యకర్తల వరకు సమన్వయంతో చేసిన కృషి ప్రధాన కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలను ఆకర్షించారు. స్థానిక సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రజలతో మమేకం కావడంతో పాటు అభివృద్ధి, 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వ నినాదాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఆయన ప్రసంగాలు పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని పెంచాయి. మిగతా 2లో...

## అసోంలో బీజేపీ హ్యాట్రిక్ విజయం...
## ఫలించిన మోదీ సేన వ్యూహం



**నేషనల్ డెస్క్ (జర్నలిస్ట్ ఫైల్) :** అసోం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ వరుసగా మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతీయ నాయకత్వం, ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ క్షేత్రస్థాయి వ్యూహాలు ఈ విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు అనుగుణంగా ఎన్‌డీఏ కూటమి స్పష్టమైన ఆధిక్యం సాధించింది.

రాష్ట్రంలో 2023లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన కీలకంగా మారింది. మొత్తం 126 స్థానాల భౌగోళిక సరిహద్దులు మారడంతో రాజకీయ సమీకరణాలు కూడా మారాయి. కొన్ని ప్రాంతాల్లో ఓటు బ్యాంక్ ప్రభావం తగ్గడంతో బీజేపీ కూటమికి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. 2లో...

## బీజేపీ విజయం 'వికసిత బారత్ 'కు నిదర్శనం

- మంత్రి సత్యకుమార్ యాదవ్



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** మతాల మధ్య విద్వేషాలు పెంచి అక్రమ చొరబాటులకి ఓటర్ ఐడి కార్డులు ఇచ్చి బెంగాల్ పేదలకి మట్టి కొట్టిన ఆటవిక పాలన అంతమొందిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. బెంగాల్ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ అత్యధిక సీట్లు సాధించి విజయం వైపు దూసుకెళ్లడంపై ఆయన స్పందించారు. ప్రాంతాలు అభివృద్ధి ప్రజలకి మౌలిక సదుపాయలు, మిగతా 2లో...

## కేరళంలో 'కమల వికాసం'... బీజేపీ సరికొత్త చరిత్ర



**నేషనల్ డెస్క్ (జర్నలిస్ట్ ఫైల్) :** కేరళం రాష్ట్ర రాజకీయాల్లో అధికార, విపక్ష కూటములకు సవాల్ విసురుతూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ మళ్లీ పుంజుకుంటోంది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో మూడు స్థానాల్లో విజయం సాధించి దాదాపు పదేళ్ల తర్వాత మరోసారి తన ఉనికిని చాటుకుంది. ఈ విజయంతో రాష్ట్రంలో పార్టీకి కొత్త ఊపు వచ్చినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మిగతా 2లో...

## బీజేపీ విజయం...మోదీ నాయకత్వం చరిత్రాత్మకం

- కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బీజేపీ ఆధిక్యం కనబర్చడంపై విజయవాడలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ స్వీట్లు పంచుతూ సంబరాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అస్సాం, పుదుచ్చేరిలో అధికారాన్ని నిలబెట్టుకోవడంతో పాటు పశ్చిమ బెంగాల్‌లో సాధించిన విజయం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. 2011లో ఒక్క ఎమ్మెల్యే కూడా లేని స్థితి నుంచి 2021లో 70 స్థానాలు సాధించి, ప్రస్తుతం దాదాపు 200 స్థానాల దిశగా పార్టీ ముందుకు సాగుతుండటం ప్రజల విశ్వాసానికి నిదర్శనమన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో గత ప్రభుత్వ పాలనలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయని, కేంద్ర పథకాలు దుర్వినియోగం అయ్యాయని ఆరోపించారు. పోలింగ్ సమయంలో కూడా దాడులు జరిగినప్పటికీ ప్రజలు ధైర్యంగా ఎదుర్కొని బీజేపీకి మద్దతు ఇచ్చారని తెలిపారు.

శ్యామ ప్రసాద్ ముఖర్జీ సొంత రాష్ట్రంలో బీజేపీ ఎదగడం విశేషమని పేర్కొంటూ, అక్కడి అభివృద్ధికి పార్టీ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. దేశంలో సమాన చట్టాలు, జాతీయ ఏకత్వం కోసం ముఖర్జీ చేసిన కృషిని ఆయన గుర్తుచేశారు.

భవిష్యత్తులో పశ్చిమ బెంగాల్ అభివృద్ధిలో ముందంజలో ఉంటుందని, ఇతర రాష్ట్రాల్లో కూడా బీజేపీ విస్తరణ కొనసాగుతుందని తెలిపారు. ఈ విజయానికి ప్రధాని నరేంద్రమోదీ, అమిత్ షా, పార్టీ నేతలు, కార్యకర్తల కృషికారణమని కేంద్రమంత్రి అభినందించారు.

## మోదీపై విశ్వాసమే
## బీజేపీకి భారీ విజయాలు



- ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పీవీయన్ మాధవ్

**శ్రీకాళహస్తి(జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తిలో పార్టీ నేతలు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పీవీయన్ మాధవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మిఠాయిలు పంచుకుని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా పీవీయన్ మాధవ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వానికి ప్రజల విశ్వాసమే ఈ ఫలితాల ద్వారా స్పష్టమైందన్నారు. పశ్చిమ బెంగాల్‌కు బీజేపీ భావజాలానికి ప్రత్యేక అనుబంధం ఉందని, పార్టీ సిద్ధాంత కర్త శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆ రాష్ట్రానికి చెందినవారని గుర్తుచేశారు. ఆయన సొంత రాష్ట్రంలో బీజేపీ విజయం సాధించడం కార్యకర్తలకు ఉత్తేజాన్ని కలిగించిందన్నారు.

2 లో..

## 'బీజేపీ'మ్యాజిక్ ...
## పుదుచ్చేరిలో ఎన్‌డీఏ వరుసగా రెండోసారి విజయం



**నేషనల్ డెస్క్ (జర్నలిస్ట్ ఫైల్):** కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఎన్‌డీఏ కూటమి మరోసారి అధికారాన్ని నిలబెట్టుకుంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు అనుగుణంగా ఆల్‌ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ (ఏఐఎన్ఆర్‌సీ) నేతృత్వంలోని కూటమి 30 అసెంబ్లీ స్థానాల్లో మెజారిటీ సాధించి వరుసగా రెండోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే స్థితికి చేరుకుంది. కాంగ్రెస్–డీఎంకే కూటమి రెండో స్థానానికే పరిమితమైంది.

ఎన్‌డీఏ విజయానికి సీఎం రంగస్వామి నాయకత్వం, కేంద్ర ప్రభుత్వ మద్దతు కీలకంగా మారినట్లు విశ్లేషకులు పేర్కొంటు న్నారు. 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం, కూటమి పార్టీల మధ్య సమన్వయం సజావుగా కొనసాగడం గెలుపుకు దోహదపడ్డాయి.

ఎన్నికల సందర్భంగా ప్రకటించిన హామీలు కూడా ఓటర్లను ఆకర్షించాయి. నీటి ఏటీఎంలు, అటల్ క్యాంటీన్లు, మహిళలకు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు, మిగతా 2లో...

## గోదావరి పుష్కరాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తాం - మంత్రి కందుల దుర్గేష్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాబోయే 2027 గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో పురపాలక శాఖ మంత్రి నారాయణ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్యేలు, మున్సిపల్ అధికారులు పుష్కరాల ఏర్పాట్లు, నిధుల అంచనాలపై సమగ్రంగా చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ "గతంలో 2015 పుష్కరాల సమయంలో కేవలం మూడు నెలల ముందే పనులు ప్రారంభించాం. కానీ ఈసారి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, ఏడాదిన్నర ముందు నుంచే పనులు మొదలుపెట్టి అత్యంత నాణ్యతతో పూర్తి చేస్తాం." అన్నారు.

పుష్కరాల నిధులతో కేవలం తాత్కాలిక ఏర్పాట్లే కాకుండా, మున్సిపాలిటీల్లో శాశ్వత ప్రాతిపదికన రోడ్లు, డ్రైనేజీలు, ఘాట్లు, తాగునీరు మరియు పార్కులను అభివృద్ధి చేస్తాం. దీనివల్ల ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలుగుతుంది అని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

"ఈ పుష్కరాలకు దాదాపు 10 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాం. భక్తుల సౌకర్యార్థం పర్యాటక శాఖ ద్వారా 'టెంట్ సిటీ'లు ఏర్పాటు చేయడంతో పాటు, స్థానిక ఇళ్లలో 'హోమ్ స్టే'లను ప్రోత్సహిస్తున్నాం. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు జోనల్ సిస్టమ్ అమలు చేస్తామన్నారు.

**రాజమహేంద్రవరంలో త్వరలో భారీ సమీక్ష:** "ప్రస్తుతం మున్సిపల్ శాఖపై సమీక్ష జరిగింది. త్వరలోనే రాజమండ్రిలో ఇరిగేషన్, దేవదాయ మరియు ఇతర అన్ని శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించి కార్యాచరణను ఖరారు చేస్తాం." అని మంత్రి దుర్గేష్ వెల్లడించారు.

మంత్రి నారాయణ అధ్యక్షతన మున్సిపాలిటీల వారీగా (రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, మండపేట) చేపట్టాల్సిన పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారని మంత్రి దుర్గేష్ వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు పనుల ప్రాధాన్యత క్రమాన్ని వివరించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అర్బన్ ఫండింగ్ మరియు ఇతర పారామీటర్ల ఆధారంగా త్వరలోనే నిధులు విడుదల చేయాలని నిర్ణయించామన్నారు. సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఇచ్చిన పలు కీలక సూచనలను పరిగణలోకి తీసుకొని ముందుకు వెళ్లాలని భావిస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, వారి భద్రతే పరమావధిగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, వచ్చే ఏడాది నాటికి అన్ని పనులను పూర్తి చేసి పుష్కరాలను ఒక చారిత్రక ఘట్టంగా మారుస్తామని మంత్రి కందుల దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు.

ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు బుచ్చయ్య చౌదరి, జోగేశ్వర రావు, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వర రావు, మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్, డైరెక్టర్ సంపత్ కుమార్, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ ఇన్ చీఫ్ ప్రభాకర్, రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, మండపేట, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు హాజరయ్యారు.

## భారత ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ కు జన్మదిన శుభాకాంక్షలు:మంత్రి కందుల దుర్గేష్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : సామాన్య కార్యకర్త స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి అత్యున్నత పదవి ఉప రాష్ట్రపతి పదవిని అలంకరించి ఆ పదవికే వన్నె తెచ్చిన ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ కు మంత్రి కందుల దుర్గేష్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రస్థానం భావితరాలకు స్ఫూర్తిదాయకమని, సుదీర్ఘ రాజకీయ అనుభవంతో, ప్రజల పట్ల అంకితభావంతో ఆయన చేస్తున్న సేవలు మరువలేనివని పేర్కొన్నారు. భగవంతుడు ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ కి పరిపూర్ణ ఆయురారోగ్యాలను, సుఖశాంతులను ప్రసాదించాలని, ఆయన నాయకత్వంలో దేశం మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంత్రి దుర్గేష్ కాంక్షించారు..

# నీటి సరఫరాకు జిల్లాకు రూ.1 కోటి

- సులభతరంగా వాహన రిజిస్ట్రేషన్లు
- అదనపు వాహన రిజిస్ట్రేషన్ అథారిటీగా వాహన డీలర్లు
- ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగంపై సలహా మండలి
- వివిధ శాఖలపై ఆర్టీజీఎస్ నుంచి సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో ఎక్కడా మంచినీటి సరఫరా సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. నీటి సరఫరా కోసం జిల్లా కలెక్టర్లకు రూ. 1 కోటి చొప్పున నిధులు విడుదల చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు. కొరత ఉన్న చోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. బోర్లు కూడా మరమ్మతులు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసేలా వాహన డీలర్లను అదనపు రిజిస్ట్రేషన్ అథారిటీగా గుర్తించేందుకు సీఎం ఆమోదాన్ని తెలియచేశారు. వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియ 24 గంటల్లో పూర్తి అయ్యేలా చూడాలని సీఎం సూచించారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అందించే పౌరసేవల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం మరింత పెంచేందుకు, సమర్థంగా వినియోగించేందుకు వీలుగా నిపుణులతో కూడిన సలహా మండలి ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో డ్రోన్ల వినియోగం పెంచేలా ఓ వర్క్‌షాప్ నిర్వహించాలని సీఎం సూచనలు చేశారు. మైనింగ్ కార్యకలాపాలను సమర్థంగా నిర్వహించేందుకు మధ్యప్రదేశ్ డ్రోన్ వ్యవస్థను వినియోగిస్తున్న తీరును అధ్యయనం చేసి ఏపీలోనూ అమలు చేసేలా చూడాలన్నారు. అవేర్ సాంకేతికతను వినియోగించుకుని వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న ప్రాంతాల్లో వడదెబ్బకు గురి కాకుండా ప్రజలకు ఉపశమనం కలిగేలా మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్‌ను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. స్వచ్ఛంధ సంస్థల సహకారాన్ని కూడా తీసుకోవాలని స్పష్టం చేశారు.

**అత్యవసర సేవలు మినహా అన్నీ ఆన్ లైన్లోనే** : ప్రభుత్వ శాఖలు ప్రజలకు అందించే వివిధ పౌర సేవలు మెరుగ్గా అందించేందుకు ఎప్పటికప్పుడు వినూత్న ఆలోచనలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సేవల్లో మెరుగైన ప్రజాభిప్రాయం కోసం పబ్లిక్ కనెక్ట్ అనేది కీలకమని సీఎం స్పష్టం చేశారు. ప్రజల్లో విశ్వాసాన్ని, క్రెడిబిలిటీని పెంచేలా ప్రభుత్వ శాఖలు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రతీ ప్రభుత్వ శాఖ నిర్దేశిత ప్రమాణాలకు తగినట్టుగా పనిచేయాల్సిందేనని ముఖ్యమంత్రి సూచించారు. పంటలకు ధర విషయంలోనూ రైతులకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు మార్కెట్ ను విశ్లేషించి తగిన చర్యలు చేపట్టాల్సిందిగా ఆర్టీజీఎస్ అధికారులను సీఎం ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరును పర్యవేక్షించేలా సీనియర్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. కార్యదర్శుల స్థాయి అధికారులు నెలలో 3 రోజుల పాటు, హెచ్ ఓడీలు 6 రోజుల పాటు, జిల్లా కలెక్టర్లు 8 రోజుల పాటు 7 క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలతో మమేకం కావాలని నిర్దేశించారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం కాల్ సెంటర్ ద్వారా వివరాలను సేకరించాలని సీఎం సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా ఉత్తమ విధానాలు అనుసరించాలన్నారు. అధికారులు ఏ అంశంలో ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారో అక్కడ మంచి ఫలితాలు వస్తున్నాయని.. మిగిలిన చోట్ల కూడా ఇదే చొరవ చూపాలన్నారు. అత్యవసర సేవలు మినహా ప్రభుత్వ శాఖలు అందించే మిగతా అన్ని సేవల్ని ఆన్ లైన్ లో అందించాలని స్పష్టం చేశారు. చేపల వేట నిషేధం ముగిసిన తర్వాత అవేర్ ద్వారా వచ్చే డేటా ఆధారంగా చేపలు సమృద్ధిగా లభించే ప్రాంతాలను మత్స్యకారులకు అందజేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఈ సమీక్షకు సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, సీఎస్ జి. సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు రాగిజావ పంపిణీ

రాగిజావ పంపిణీ కార్యక్రమం మరో మూడేళ్ల పొడిగింపునకు ప్రభుత్వం నిర్ణయం

మంత్రి నారా లోకేష్ సమక్షంలో శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్‌తో విద్యాశాఖ ఎంవోయూ



**ఉండవల్లి (జర్నలిస్ట్ ఫైల్)** : ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు సన్నబియ్యంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా కూటమి ప్రభుత్వం అందిస్తోంది. మెనూలో మార్పులతో ఎక్కువమంది భోజనం చేస్తున్నారు. భోజనం మరింత రుచి, శుచిగా వడ్డించేలా విద్య, ఐటీ శాఖల మంత్రిగా నారా లోకేష్ ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు అదనపు పోషకాహారం అందించే నిమిత్తం శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ సహకారంతో ప్రస్తుతం అమలులో ఉన్న రాగిజావ పంపిణీ కార్యక్రమం మరో మూడేళ్లు కొనసాగింపునకు ప్రజాప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంత్రి నారా లోకేష్ సమక్షంలో 2026-29 కాలానికి విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమం కొనసాగించేందుకు శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్‌తో విద్యాశాఖ ఎంవోయూ కుదుర్చుకుంది. శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ సహకారంతో రాగిజావ పంపిణీ కార్యక్రమం మార్చి 2023లో ప్రారంభం కాగా.. ఈ ఏడాది ఏప్రిల్ తో కాలపరిమితి ముగిసింది. దీంతో పొడిగింపునకు విద్యాశాఖ ఎంవోయూ కుదుర్చుకుంది.

ప్రస్తుతం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో జోనల్ వారీగా విద్యార్థులకు మెనూ అమలుచేస్తున్నారు. ఈ మెనూలో ఫోర్టిఫైడ్ ఫైన్ రైస్, వారానికి 5 సార్లు గుడ్డు, వారానికి మూడు సార్లు చిక్కీ, అలాగే పోషకాహారపు పదార్థులుగా చిక్కీలేని రోజుల్లో రాగిజావను వారానికి మూడు సార్లు అందిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకంపై ప్రభుత్వం ఏడాదికి సుమారు 1,850 కోట్లు ఖర్చుచేస్తోంది. తద్వారా విద్యార్థుల ఎన్ రోల్ మెంట్, అటెండెన్స్, డ్రాప్ అవుట్స్ నివారణ, పోషకస్థాయిలు మెరుగుపరచడమే లక్ష్యంగా పెట్టుకుంది. విద్యార్థులకు హెల్త్ సప్లిమెంట్ గా రాగిజావను పంపిణీ చేస్తున్నారు. 10గ్రాముల రాగి పిండి, 10 గ్రాముల బెల్లం పొడిని 150 మిల్లీలీటర్ల వేడినీటిలో కలిపి విద్యార్థులకు అందించడం జరుగుతోంది. తద్వారా కాల్షియం, ఐరన్ తో సమృద్ధిగా ఉండి పోషకాహారాన్ని మెరుగుపరుస్తుంది. రాగిపిండి, బెల్లంపొడిని శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఉచితంగా అందిస్తుంది. ట్రస్ట్ ద్వారా జిల్లా కేంద్రాల వరకు సరఫరా చేస్తారు. అక్కడి నుంచి పౌరసరఫరాల శాఖ ద్వారా పాఠశాలలకు పంపిణీ చేస్తారు. ఇందుకోసం మూడేళ్లలో రూ. 80 కోట్ల వరకు వెచ్చించనున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జే రత్నాకర్, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ అడ్మిన్ కోఆర్డినేటర్ ఎస్. జి చలం, శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగం అధ్యక్షులు ఆర్.లక్ష్మణరావుతో పాటు మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, అడిషనల్ డైరెక్టర్ ఆర్.ఎస్ గంగా భవాని తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్-ట్రంప్ కొత్త ప్లాన్



**వాషింగ్టన్, టెహ్రాన్** : అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ తాజాగా 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' పేరుతో కొత్త ప్లాన్ ను ప్రకటించారు. యుద్ధ కారణంగా హర్మూజ్ జలసంధిలో చిక్కుకున్న ఓడలను ఈ ప్లాన్ కింద అమెరికా నేవీ సురక్షితంగా బయటకు తీసుకొస్తుందని ట్రంప్ తెలిపారు. ఈ ప్లాన్ సోమవారం ప్రారంభమవుతుందని ట్రంప్ తెలిపారు. 'ప్రపంచంలోని అనేక దేశాలు తమ ఓడలు, సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకురావాలని మమ్మల్ని అభ్యర్థించాయి. మేము వాటిని సురక్షితంగా గైడ్ చేస్తాం. ఈ ప్రక్రియలో ఎవరైనా అడ్డుపడితే బలప్రయోగం చేసి ఎదుర్కొంటాం- అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్ట్‌లో తెలిపారు. ఈ ప్లాన్ ప్రకారం నిష్పాక్షిక దేశాల ఓడలను మాత్రమే సహాయం చేస్తామని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకారం, ఈ ఆపరేషన్‌లో గైడెడ్ మిస్సైల్ డెస్ట్రాయర్లు, వందకి పైగా విమానాలు, డ్రోన్లు, 15,000 మంది సైనికులు పాల్గొంటారు. ఇది పూర్తి ఎస్కార్ట్ మిషన్ కాదని, గైడెన్స్, కోఆర్డినేషన్ ఆధారితమని అధికారులు చెప్పారు. విశ్లేషకులు మాత్రం ఈ ప్లాన్ ను కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనగా విమర్శిస్తున్నారు. ఈ ప్లాన్ తో మధ్య ఆసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింతగా పెరుగుతాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, ఇరాన్ లో పాలనను ఉక్కిరిబిక్కిరి చేస్తామని అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధింపై అమెరికా చేస్తున్న దిగ్బంధనం విస్తృత ఆర్థిక ఆంక్షలలో ఒక భాగం మాత్రమే అని అన్నారు.

**హర్మూజ్ భద్రత ఇరాన్ సైన్యం నియంత్రణలోనే..** హర్మూజ్ జలసంధిలోకి ప్రవేశిస్తే అమెరికా బలగాలపై దాడి చేస్తామని ఇరాన్ సైన్యం సోమవారం హెచ్చరించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ జలసంధిలో నౌకలకు రక్షణ కల్పిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఇరాన్ ఈ హెచ్చరిక చేసింది. ఈ జలసంధిలో అమెరికా జోక్యం చేసుకుంటే అది కాల్పుల విరమణ ఉల్లంఘనగా భావిస్తామని ఇరాన్ స్పష్టం చేసింది. ' ఏ విదేశీ సాయుధ దళం – ముఖ్యంగా దూకుడు స్వభావం గల అమెరికా సైన్యం – హర్మూజ్ జలసంధిని సమీపించడానికి లేదా ప్రవేశించడానికి ప్రయత్నిస్తే, వాటిని లక్ష్యంగా చేసుకుని దాడి చేస్తాం- అని ఇరాన్ సైన్యం సెంట్రల్ కమాండ్ మేజర్ జనరల్ అలీ అబ్దుల్లాహి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## శ్రీకాళహస్తిలో ఘోర రోడ్డు ప్రమాదం




**శ్రీకాళహస్తి** : తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని నాయుడు పేట-పూతలపట్టు జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి అంబులెన్స్ వేగంగా ఢీకొట్టిన సంఘటనలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీకాళహస్తి రూరల్ ఎస్ఐ వెంకటేష్ కథనం ప్రకారం... పశ్చిమ బెంగాల్ హుగ్లీ జిల్లా అస్తమా రోగి బ్రీజా డోలాయ్ కు అత్యవసర చికిత్స కోసం బెంగుళూరు తీసుకెళ్లేందుకు బంధువులు ప్రయివేట్ అంబులెన్సులో ఆదివారం బయలుదేరారు. సోమవారం తెల్లవారుజామున శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని బృందావన్ హోటల్ వద్ద జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని అంబులెన్స్ డ్రైవర్ గమనించకపోవడంతో అతివేగంతో వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో అంబులెన్స్ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో అస్తమా రోగి బ్రీజా డోలాయ్ (48)తో పాటు ఆయన భార్య తాగూరీ డోలాయ్(40), రోగి అన్న జతిన్ డోలాయ్ (63), సమీప బంధువు గీతా చక్రవర్తి (48), అంబులెన్సు ప్రత్యామ్నాయ డ్రైవర్ జితేష్ పండిట్ (32) సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. అంబులెన్సు డ్రైవర్ రాకేష్ పండిట్(35), మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ పోలీసులు క్షతగ్రాతులను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి పట్టణంలోని ఎంజిఎం ఆస్పతికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆంధ్రా ఉపాధ్యాయులు.. సింగపూర్ బాట

- 37 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అంతర్జాతీయ వేదికపై శిక్షణ
- నేడు ప్రపంచ విద్యార్థులు... రేపటి తరానికి మార్గదర్శకులు!
- ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో నవశకం
- గ్లోబల్ స్టాండర్డ్స్ దిశగా అడుగులు..



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాఠశాల విద్యారంగంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, బోధనా నాణ్యతను ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తీసుకెళ్లే ఒక అద్భుతమైన యజ్ఞానికి శ్రీకారం చుట్టింది. దేశ చరిత్రలోనే ఒక వినూత్న ప్రయోగంగా, మన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు ఇప్పుడు అంతర్జాతీయ వేదికలపై శిక్షణ పొందుతూ, గ్లోబల్ లీడర్లుగా ఎదుగుతున్నారు. దీనిలో భాగంగా, 2025లో 'రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు' పొందిన 37 మందికి అంతర్జాతీయ స్థాయిలో విజ్ఞానాన్ని అందించేందుకు అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ విజిట్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు, ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు 'ఫ్యూచర్ రెడీ' సంకల్పం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవ ప్రశంసనీయం.

**ముఖ్యమంత్రి గారి 'ఫ్యూచర్ రెడీ' సంకల్పం:** రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి ప్రపంచంలోని ఏ మూలన ఉన్న విద్యార్థితోనైనా పోటీ పడాలన్నది ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆకాంక్ష. దానికి పునాది పాఠశాల నుంచే పడాలని, కేవలం మౌలిక సదుపాయాలకే పరిమితం కాకుండా బోధనా నాణ్యతను పెంచేందుకు ఆయన ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

**నారా లోకేష్ ప్రత్యేక చొరవ:** 'డిజైనింగ్ లెర్నింగ్ – ఇన్‌స్పైరింగ్ థింకింగ్'ఈ దిశగా విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి నారా లోకేష్ ప్రతి నిర్ణయంలోనూ 'అంతర్జాతీయ ప్రమాణాల'ను జోడిస్తున్నారు. సింగపూర్‌లోని ప్రతిష్టాత్మక నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఫిన్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ తుర్కులతో ఒప్పందాలు కుదుర్చుకోవడం వంటి గ్లోబల్ నెట్‌వర్కింగ్ లో ఆయన కీలక పాత్ర పోషించారు. ఉపాధ్యాయులు కేవలం సమాచారాన్ని అందించే వారుగా కాకుండా, పిల్లల్లో ఆలోచనలను ప్రేరేపించే 'లెర్నింగ్ ఫెసిలిటేటర్స్'గా మారాలని లోకేష్ ఈ శిక్షణా కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

**సింగపూర్ బాటలో 'లెర్నింగ్ ఫెసిలిటేటర్స్':** తొలుత సింగపూర్‌లోని ప్రతిష్టాత్మక నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో మే 4 నుండి మే 8, 2026 వరకు జరుగుతున్న ఈ 5 రోజుల శిక్షణా కార్యక్రమం ఒక మైలురాయి. "డిజైనింగ్ లెర్నింగ్, ఇన్‌స్పైరింగ్ థింకింగ్" అనే నినాదంతో సాగుతున్న ఈ పర్యటనలో 37 మంది ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

**పారదర్శకతకు నిదర్శనం:** బృందంలో కేవలం ఒక విభాగానికే పరిమితం కాకుండా, విద్యా వ్యవస్థలోని అన్ని స్థాయిలకు ప్రాతినిధ్యం కల్పించడం ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటుతోంది. మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు, రాజకీయాలకు తావులేకుండా కేవలం ప్రతిభ ఆధారంగా 10 మంది హెడ్ మాస్టర్లు, 18 మంది స్కూల్ అసిస్టెంట్లు, 4 గురు ప్రిన్సిపాల్స్, 5 గురు ఫిజికల్ డైరెక్టర్లను విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఉన్నతాధికారులు ఈ పర్యటనకు ఎంపిక చేశారు. వీరిలో 17 మంది మహిళలు ఉండటం కొసమెరుపు.

**శిక్షణలో ఇవీ...:** NIE లో మే 4 నుండి 8 వరకు ప్రతిరోజూ ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు జరిగే శిక్షణా తరగతుల్లో పాల్గొంటారు. 'అనిశ్చిత కాలంలో విద్య - ఎదుర్కొంటున్న సవాళ్లు', సింగపూర్ విద్యా విధానంపై అవగాహన, బోధనా ప్రణాళిక రూపకల్పన , యిషున్ సెకండరీ స్కూల్ సందర్శన, విశ్లేషణాత్మక ఆలోచనబోధనపై చర్చ, అధ్యాపకులకు అవసరమైన సమన్వయ నైపుణ్యాలపై అవగాహన, ఆంధ్రప్రదేశ్‌లోని తరగతి గదులను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సిద్ధం చేయడం, అర్థవంతమైన అభ్యసన రూపకల్పన వంటి కీలక అంశాలపై ప్రత్యేక శిక్షణతో ఈ కార్యక్రమం ముగుస్తుంది.

**కేవలం పాఠాలు కావు.. సరికొత్త పాఠాలు!** : ఉపాధ్యాయుడు అంటే కేవలం పాఠాలు చెప్పేవాడు మాత్రమే కాదు.. విద్యార్థిలోని ఆలోచనలను తట్టిలేపే ఒక మార్గదర్శి అని నిరూపించడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశం.

విద్యార్థులు ప్రశ్నలు అడిగేలా, విమర్శనాత్మక దృక్పథంతో ఆలోచించేలా (క్రిటికల్ థింకింగ్) చేసే మెళకువలు, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలను ఆకర్షణీయంగా రూపొందించడం, సింగపూర్‌లోని 'యిషున్ సెకండరీ స్కూల్' వంటి పాఠశాలలను సందర్శించి, అక్కడి తరగతి గది నిర్వహణను, డిజిటల్ బోధనా పద్ధతులను మన టీచర్లు ప్రత్యక్షంగా అధ్యయనం చేస్తున్నారు.

**ఫిన్లాండ్ వైపు మరో అడుగు!:** సింగపూర్ పర్యటనతో పాటు, విద్యా ప్రమాణాల్లో ప్రపంచానికే పాఠాలు నేర్పే ఫిన్లాండ్‌లోని 'యూనివర్సిటీ ఆఫ్ తుర్కు'కి మరో 29 మంది ఉపాధ్యాయులను ప్రభుత్వం పంపేందుకు ప్రణాళిక వేస్తోంది. ఏపీ విద్యారంగం గ్లోబల్ మ్యాప్‌లో ఎంత వేగంగా దూసుకుపోతుందో అనడానికి ఇది ఒక నిదర్శనం.

**అంతర్జాతీయ మెళకువలను క్షేత్రస్థాయికి...** : కేవలం పర్యటనలతోనే సరిపెట్టకుండా, ఈ ఉపాధ్యాయులు తిరిగి వచ్చాక తమ పాఠశాలల్లో 'పోస్ట్ ట్రైనింగ్ యాక్షన్ ప్లాన్' అమలు చేసేలా ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రణాళికను రూపొందించింది. వీరు రాష్ట్రంలోని ఇతర ఉపాధ్యాయులకు మెంటర్లుగా వ్యవహరిస్తూ, తాము నేర్చుకున్న అంతర్జాతీయ మెళకువలను క్షేత్రస్థాయికి చేరుస్తారు.

నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ లక్ష్యాలకు అనుగుణంగా, మన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ తపన అభినందనీయం. ఉపాధ్యాయుల నైపుణ్యమే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది అని నమ్మిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఈ శిక్షణ ద్వారా రేపటి తరానికి ఒక సువర్ణ అధ్యాయాన్ని లిఖిస్తోంది.

ఉపాధ్యాయుల నైపుణ్యాన్ని మెరుగుపరచడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తును బంగారుమయం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం విద్యారంగంలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది.

**విద్యా వ్యవస్థలో గుణాత్మక మార్పునకు నాంది** : "ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, విద్యాశాఖ మంత్రి పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా ఉపాధ్యాయులను ఎంపిక చేశాం. ఈ శిక్షణ కేవలం ఒక పర్యటన మాత్రమే కాదు; ఇది మన విద్యా వ్యవస్థలో గుణాత్మక మార్పునకు నాంది. సింగపూర్‌లోని 'యిషున్ సెకండరీ స్కూల్' వంటి చోట్ల వారు నేర్చుకుంటున్న 'ఇన్‌స్ట్రక్షనల్ డిజైన్', 'క్రిటికల్ థింకింగ్' మెళకువలు మన రాష్ట్రంలోని తరగతి గదులను 'ఫ్యూచర్ రెడీ'గా మారుస్తాయనడంలో సందేహం లేదు. అక్కడి నుండి తిరిగి వచ్చిన ఉపాధ్యాయులు ఇతర టీచర్లకు మెంటర్లుగా మారి, ఈ అంతర్జాతీయ జ్ఞానాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లేలా పక్కా యాక్షన్ ప్లాన్ రూపొందించాం."

## భారతి నగర్ లో ఘనంగా హిందూ సమ్మేళనం



రామచంద్రపురం మే04(జర్నలిస్ట్ ఫైల్): హిందూ బంధువుల ఐక్యతతో ఎల్ఐజి భారతి నగర్ వేదికగా హిందూ సమ్మేళనం శ్రీ కార్యసిద్ధి పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం ఎల్ఐజి కాలనీ భారతి నగర్ నిర్వహించడం జరిగింది , సత్య ప్రభుజీ ముఖ్యఅతిథిగా, ఆర్ఎస్ఎస్ రవి మరియు పలువురు వక్తలు పాల్గొనడం జరిగింది, ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలను విచ్చేసిన హిందూ బంధువులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ భారతి నగర్ డివిజన్ సీనియర్ నాయకులు కంజర్ల కృష్ణమూర్తి, సునంద, రాజేందర్ చారి, శ్రీనివాస్ చారి, తదితర బిజెపి సీనియర్ నాయకులు కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది, ఈ సందర్భంగా కంజర్ల కృష్ణమూర్తి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినారు. నిర్వాహకులను, కార్యక్రమంలో పాల్గొని తమ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన చిన్నారులను, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజలను అభినందించారు, ఇటువంటి హిందూ సమ్మేళనాలు రాబోయే కాలంలో మరెన్నో జరగాలని కోరుకున్నారు.

## దేవాలయాల్లో కెమెరాలు అమర్చుకోండి

**- దొంగతనాలను అరి కట్టండి**

**- పోలీస్ శాఖ సూచనలు పాటించండి**

ఖమ్మం, చింతూరు, మే 04 (జర్నలిస్ట్ ఫైల్) : చింతూరు దేవాలయాల్లో సీసీ కెమెరాలు అమర్చుకొని దొంగతనాలను అరికట్టాలని దేవాలయాల కమిటీలను చింతూరు సిఐ గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల దేవాలయాల్లో దేవుళ్ళ నగలు దోచుకోవటం, కానుకల డిబ్బిలను పగలగొట్టి దోచుకు వెళ్తున్నారు.ఈ నేపథ్యంలో ఈ జిల్లా ఎస్పీ అమిత్ క బర్దర్, ఎస్పి హేమంత్ ఆదేశాల మేరకు చింతూరు పోలీస్ సర్కిల్లో ఉన్న దేవాలయాల్లో దేవుళ్ళ విగ్రహాలపై ఉన్న నగలను దేవస్థానాల కమిటీలు తీసివేసి భద్రపరచు కోవాలని, అలాగే హుండీలోని డబ్బును ఎప్పటికప్పుడు లెక్కించుకోని బ్యాంకుల్లో జమ చేసుకోవాలని చింతూరు సిఐ తెలిపారు. దేవాలయాల పరిసర ప్రాంతాల్లో అనుమానిత, ఆపరిచిత వ్యక్తులు ఎవరైనా తిరుగుతుంటే వెంటనే తమకు తెలియ జేయాలని కోరారు. దేవాలయ కమిటీ వారు చొరవ తీసుకొని దొంగతనాలను అరికట్టడానికి పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

### మల్కాన్ గిరి జిల్లాలో(ఒడిశా )రు.100 కోట్ల

## విలువగల లిక్విడ్ గంజాయి స్వాధీనం



ఖమ్మం, చింతూరు, మే 04 (జర్నలిస్ట్ ఫైల్) : ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి జిల్లా చిత్రకొండ డి.ఎస్.పి ప్రదోష్ నాయకత్వంలో ప్రత్యేక బృందం ఎస్సార్ చెక్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రేషన్తో నకిలీ నెంబర్స్ ఉన్న ఒక జీపును స్వాధీనం చేసుకున్నారు. నేరస్తులు పరారయ్యారు.ఆ జీపులో లిక్విడ్ గంజాయి తయారుచేసే మొబైల్ యూనిట్ ను కనుగొన్నారు. కొన్ని రోజులుగా మల్కనగిరి జిల్లాలో లిక్విడ్ గంజాయి తయారవుతుందని తెలుసుకున్న పోలీసులు పథకం ప్రకారం గోప్యంగా ఉంచి వాహనాలు తనిఖీ చేసి ఆదివారం ఎట్టకేలకు పట్టుకున్నారు. ఆపరేషన్ లో సుమారు రు.100 కోట్ల విలువ గల 800 లీటర్ల లిక్విడ్ గంజాయి, 50 కిలోల ఎండు గంజాయి, వివిధ కెమికల్స్ పట్టుకున్నారు. గత కొద్ది కాలంగా మొబైల్ వాహనాల ద్వారా లిక్విడ్ గంజాయి తయారవుతుందని తెలుసుకున్న పోలీసులు గట్టినిఘా ఏర్పాటు చేసుకొని పథకం ప్రకారం పట్టుకున్నారు. మల్కనగిరి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడంతోపాటు, ఈ వ్యవహారంలో ఉన్న ఇతరులను గుర్తించడం, రాష్ట్ర సంబంధాలను వెలికి తీయడం కోసం దర్యాప్తు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు చిత్రకొండ ఏరియాలో పెద్ద ఎత్తున లిక్విడ్ గంజాయి తయారీ చేయాలనే స్మగ్లర్లు భావిస్తున్నప్పటికీ పోలీస్ లు నిరంతర నిఘా కారణంగా ప్రయత్నం విఫలమైనట్లు తెలిసింది.

## తునికాకు టెండర్లను వెంటనే వేయాలి

**: డివిజన్ సి పి ఐ కార్య దర్శి గుజ్జా మోహన్ రావు**

ఖమ్మం, చింతూరు, మే 04 (జర్నలిస్ట్ ఫైల్) : చింతూరు డివిజన్లో గిరిజనులకు రెండవ పంట అయిన తునికాకు టెండర్లను వెంటనే వేయాలని సి పి ఐ డివిజన్ కార్యదర్శి గుజ్జా మోహన్ రావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తర్వాత అయినా టెండర్లు వేస్తారని ఇప్పటికే స్వయంగా గిరిజనులు ఎవరికి వారే వారి పొలాల్లో ప్రూనింగ్ పనులు చేసుకున్నారు. ఆకు ముదిరిపోయి ప్రభుత్వం కొనక పోతే, తమ గిరిజనులు నష్టపోవాల్సి వస్తుందని ఇప్పటికైనా ప్రభుత్వం తునికాకు టెండర్లు తెరవాలని కోరారు. అలాగే సమైక్యాంధ్ర ఉన్నప్పుడు 2015 వరకు తునికాకు బోనస్ ప్రభుత్వం ఇచ్చేదని, విభజన తర్వాత ఇప్పటివరకు గిరిజనులకు కోట్లాది రూపాయలు బోనస్ ఇవ్వాల్సి ఉండగా మొండిచేయి చూపించిందని, వెంటనే స్పందించి తునికాకు బోనస్ కూడా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఎస్కే రంజాన్,సి పి ఐ చింతూరు మండల కార్యదర్శి తుర్రం మురళి, సీనియర్ నాయకులు వెట్టి. భద్రయ్య, సోడి కన్నా రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాలేవి ఉపాధి ఎక్కడ పాలకుల మెడలు వంచుతాం

**- ఏఐవైఎఫ్ 67 వ ఆవిర్భావ వేడుకల్లో జిల్లా ఇన్చార్జ్ కొండపర్తి గోవిందరావు**

**- మత్తు పదార్థాలపై నానబాల రామకృష్ణ హెచ్చరిక**



ఖమ్మం,మే04(జర్నలిస్ట్ ఫైల్): "ఉద్యోగాలేవి ఉపాధి ఎక్కడ పాలకులారా సమాధానం చెప్పండి. లేదంటే మీ మెడలు వంచైనా యువత హక్కులను సాధించుకుంటాం" అని ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) జిల్లా ఇన్చార్జ్ కొండపర్తి గోవిందరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం ఖమ్మం నగరంలోని నలమల్ల గిరిప్రసాద్ భవన్లో ఏఐవైఎఫ్ 67 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సంఘం పతాకాన్ని ఆవిష్కరించి, అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు 1959 మే 3 న ఢిల్లీలో స్థాపించబడిన ఏఐవైఎఫ్ నాటి నుండి నేటి వరకు యువత పక్షాన నిలబడి 18 సంవత్సరాల నిండిన యువతి,యువకులకు ఓటు హక్కు సాధించిన ఘనత ఏఐవైఎఫ్ దే అని , పోరాడుతోందని గుర్తు చేశారు. నేడు దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తాండవిస్తోందని, చదువుకున్న యువతకు ఉపాధి చూపడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని మండిపడ్డారు. నోటిఫికేషన్ల పేరుతో కాలయాపన చేస్తూ నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న పాలకులకు రాబోయే రోజుల్లో యువత తగిన బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. "అందరికీ పని - అందరికీ విద్య" అనే లక్ష్యం నెరవేరే వరకు ఏఐవైఎఫ్ విశ్రమించదని ఆయన స్పష్టం చేశారు.మత్తు మహమ్మారి పై నానబాల రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు విచ్చలవిడిగా లభిస్తుండటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి లేక నిరాశలో ఉన్న యువతను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ మాఫియా పంజా విసురుతోందని, దీనిని అరికట్టడంలో ప్రభుత్వం యంత్రాంగం విఫలమయ్యాయని విమర్శించారు. యువత మత్తు కోరల్లో చిక్కుకుని తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, సామాజిక చైతన్యంతో పోరాటాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.- ఘనంగా వేడుకలు ఈ ఆవిర్భావ వేడుకల్లో జిల్లా కమిటీ ప్రతినిధులు, వివిధ మండలాల బాధ్యులు, పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు. ఏఐవైఎఫ్ వర్ధిల్లాలి, నిరుద్యోగ నిర్మూలన సాధ్యం కావాలి" అంటూ చేసిన నినాదాలతో నలమల్ల గిరిప్రసాద్ భవనం మారుమోగింది.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి లు మామిండ్ల శ్రీ నాథ్ రెడ్డి, చింతల రమేష్, మల్లెబోయిన ఉపేందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాద్దోజ్ శ్రావణ్, జిల్లా ఉపాధ్యక్షులు గణపరపు ఉపేందర్, మామిడాల కిరణ్, దొంతగాని ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

**-చౌదర్పల్లి లో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం -హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి. -మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్. -టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**












మే 04 (జర్నలిస్ట్ ఫైల్) : తలకొండపల్లి తలకొండపల్లి మండలం,చౌదర్పల్లి గ్రామం శ్రీ ఆంజనేయ స్వామి నూతన దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం కన్నుల పండుగ నిర్వహించడం జరిగింది. గణపతి హోమం,పుష్పార్చన,ధ్వజస్తంభం ప్రస్తాపన,మొదలగు దైవ కార్యక్రమాలు మూడు రోజులపాటు జరిగిన వివిధ పూజా కార్యక్రమాలను తిలకించిన భక్తులు ఆదివారం శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట భక్తిశ్రద్ధలతో తిలకించారు. వేద పండితులు గూడ యాదగిరి నరసింహ శాస్త్రి,గూడా శ్రీనివాసమూర్తి వారి బృందం మంత్రోచ్ఛరణల మధ్య భక్తి పరవశంతో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని తిలకించారు.దైవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్,ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని,స్వామి దర్శనం చేసుకొని,తీర్థ స్వీకరించడం జరిగింది,అనంతరం దేవాలయం ప్రాంగణంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ..ఆధ్యాత్మికమై,పవిత్రమైన ఇంత గొప్ప కార్యక్రమానికి తనను ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ, స్వామి వారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ పాడి పంటలతో,సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నానని తెలియజేశారు.ఈ కార్యక్రమంలోస్థానిక ప్రజా ప్రతినిధులు,ఆలయ కమిటీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దోకూరు ప్రభాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యట నరసింహ,లింగరావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి,జూలపల్లి సర్పంచ్ శేఖర్ యాదవ్, వివిధ గ్రామాల మాజీ ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు,పాటు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### వర్షంలోనూ 'భరోసా' - తడిసినా వీడని జనం, గదిలో

# కూర్చుని మంత్రి పొంగులేటి వినతుల స్వీకరణ

**- బచ్చోడు 'ప్రజా దర్బార్'కు అపూర్వ స్పందన**

**- అధికారులే ప్రజల వద్దకు రావాలి, అదే ఈ ప్రభుత్వం లక్ష్యం- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు : మంత్రి పొంగులేటి**



ఖమ్మం, తిరుమలాయపాలెం, మే 04 (జర్నలిస్ట్ ఫైల్) : వాన ధారగా కురుస్తోంది, బయట ఉంటే తడిసి ముద్దవ్వక తప్పని పరిస్థితి. కానీ, తమ గోడు వినే 'పెద్దన్న' వచ్చాడని తెలిసి ఆ వానను కూడా ప్రజలు లెక్కచేయలేదు. ప్రజల కష్టాలు తీర్చేందుకు వచ్చిన మంత్రి పొంగులేటి సైతం వర్షానికి వెరవలేదు. సభా ప్రాంగణం తడిసినా, స్కూలు గదిని వేదికగా చేసుకుని బాధితుల కన్నీళ్లు తుడిచారు. పాలేరు నియోజకవర్గంలో ఆదివారం సాయంత్రం జరిగిన 'ప్రజా దర్బార్'లో కనిపించిన దృశ్యమిది!

**- చినుకు పడినా, చిక్కులు విన్నవించిన జనం**

తిరుమలాయపాలెం మండలం బచ్చోడు క్లస్టర్ పరిధిలోని 12 గ్రామ పంచాయతీల ప్రజల కోసం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు. సభ సాగుతున్న తరుణంలో ఒక్కసారిగా వాతావరణం మారి వర్షం కురిసింది. జనం చెల్లాచెదురవుతున్న సమయంలో మంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. వెంటనే పాఠశాలలోని ఒక తరగతి గదిలోకి వెళ్లి, అక్కడే బెంచీలపై కూర్చుని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వర్షంలో తడుస్తూ వచ్చిన బాధితులకు "నేను ఉన్నాను. మీ సమస్యలు త్వరగా పరిష్కరిస్తాం" అని అభయమిచ్చారు.



**- చెప్పులు అరిగేలా తిరిగే రోజులు పోయాయి**

అంతకుముందు సభను ఉద్దేశించి మంత్రి ప్రసంగిస్తూ "ప్రజలు తమ సమస్యల కోసం ఆఫీసుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగే పాత పద్ధతులకు స్వస్తి పలకాలి. ప్రభుత్వమే నేరుగా మీ గడప వద్దకు వచ్చి సేవలు అందించాలనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష. అందుకే ఈ క్లస్టర్ స్థాయి ప్రజా దర్బార్లను నిర్వహిస్తున్నాం" అని పేర్కొన్నారు.

## శ్రీ వారహిమాత విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

**శ్రీ వారాహి అమ్మ ట్రస్ట్ చైర్మన్ మాతృశ్రీ మమతమ్మ కు ధన్యవాదాలు**

**-ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి.**



గజ్వేల్, మే 04 (జర్నలిస్ట్ ఫైల్) : సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రకృతి వెంచర్ లో శ్రీ వారాహి అమ్మ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ వారాహి దేవి సమేత ప్రత్యంగిరా దేవి, శరభేశ్వర స్వామి, కాలభైరవ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ నేతృత్వంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా గజ్వేల్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, అమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుకునూరుపల్లి గ్రామంలో శ్రీ వారాహి అమ్మవారి అమ్మ దేవాలయం స్థాపించినందుకు ముందుగా



శ్రీ వారాహి అమ్మ ట్రస్ట్ చైర్మన్ మాతృశ్రీ మమతమ్మ కు ధన్యవాదాలని, శ్రీ వారాహి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామని, మా ప్రాంతంలో శ్రీ వారాహి అమ్మవారి దేవాలయం ఉండడం మా ప్రాంత ప్రజల పూర్వజన్మ సుకృతం అని అన్నారు. కుకునూరుపల్లి మండల ప్రజలే కాకుండా సిద్దిపేట జిల్లా ప్రజలందరూ అమ్మవారిని దర్శించుకుని, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, కుకునూర్ పల్లి గ్రామ సర్పంచ్ కనకవ్వ ఐలయ్య, సీనియర్ నాయకులు లక్ష్మణ్ రాజు, శ్రీ వారాహి అమ్మ ట్రస్ట్ చైర్మన్ మాతృశ్రీ మమతమ్మ, ట్రస్ట్ సభ్యులు రామప్ప, ఆంజనేయులు, వేద పండితులు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ఆర్యవైశ్య నాయకులు, మహిళలు, చిన్నారులు, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాకారులకు శుభవార్త ఏన్కూర్ ప్రీమియర్ లీగ్ సీజన్ -.1

**ఈనెల ఐదు నుంచి క్రికెట్ టోర్నమెంట్.**




ఏన్కూరు, (జర్నలిస్ట్ ఫైల్) : ఈనెల 5 నుంచి 9 మండలాల క్రికెట్ పోటీలను ఏన్కూర్ క్రికెట్ క్లబ్ వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ని క్రీడా ప్రాంగణంలో క్రికెట్ టోర్నమెంట్ జరగనున్నాయ ని నిర్వహకులు తెలిపారు. విజేతలకు భారీ నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు. మొదటి బహుమతి 30 వేల రూపాయలు ట్రోఫీ, ద్వితీయ బహుమతి 25 వేల రూపాయలు ట్రోఫీ , తృతీయ బహుమతి 20 వేల రూపాయలు ట్రోఫీ, నాలుగో బహుమతి పదివేల రూపాయల ట్రోఫీ, గదును అందజేస్తామని తెలిపారు. ఎంట్రీ ఫీజు ?1000 ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు .క్రికెట్ క్రీడాకారులు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు అవినాష్ 6305361706,ఎస్ కే నజీర్ 9063991501, సయ్యద్ ఖాసీం: 9666783001. ల ను సంప్రదించాలని కోరారు. అదేవిధంగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు..

## రంగారెడ్డి జిల్లాలో ప్రైవేటు పాఠశాలలపై నిర్లక్ష్యం

**హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆయిల్ శ్రీశైలం గౌడ్**




కేశంపేట, (జర్నలిస్ట్ ఫైల్) : రంగారెడ్డి జిల్లాలో ప్రైవేటు పాఠశాలల నిర్వహణపై ప్రభుత్వ విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం ఉందా లేదా పాఠశాల యాజమాన్యాలతో ఒప్పందాలు ఉన్నాయా అనే అనుమానాలను హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా జిల్లా అధ్యక్షుడు ఆయిల్ శ్రీశైలం గౌడ్ వ్యక్తం చేశారు. జిల్లాలోని వివిధ మండలాల్లో నడుస్తున్న అనేక ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ మార్గదర్శకాలను పూర్తిగా ఉల్లంఘిస్తున్నప్పటికీ, విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు.దాదాపు గత 20 సంవత్సరాలుగా సరైన అనుమతులు లేకుండానే లేదా తప్పుడు అనుమతి పత్రాలతో పాఠశాలలు నడుస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ, వారిని మానసిక ఒత్తిడికి గురి చేస్తున్న యాజమాన్యాలపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రైవేటు పాఠశాలల తనిఖీల విషయంలో విద్యాశాఖ అధికారులు జాప్యం చూపుతున్నారని కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21-ఎ ప్రకారం విద్య ప్రతి పిల్లవాడి ప్రాథమిక హక్కు అని, 2002లో వచ్చిన 86వ సవరణ ద్వారా దీనికి చట్టబద్ధత కల్పించబడిందని గుర్తుచేశారు. విద్య హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు మరియు అన్ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు బలహీన వర్గాలు మరియు ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు ఉచితంగా ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, ఈ నిబంధనలు సక్రమంగా అమలు కావడం లేదని అన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలలపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుని అవసరమైతే గుర్తింపును రద్దు చేయాలని ఆయన కోరారు.

### అటవీ శాఖ అండతో

### అక్రమ కలప రవాణా- కుల్కచర్లలో ప్రజల ఆగ్రహం





వికారాబాద్ మే 04 (జర్నలిస్ట్ ఫైల్) : పరిగి నియోజకవర్గంలోని కుల్కచర్ల మండలంలో అక్రమ కలప వ్యాపారం నిర్బంధం లేకుండా సాగుతోందని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ సంపదను రక్షించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసుల అండదండలతోనే కలప మాఫియా దూసుకుపోతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.స్థానికుల కథనం ప్రకారం, అడవుల్లో చెట్లను నరికి లారీల్లో కలపను తరలిస్తున్న ఘటనలు తరచూ జరుగుతున్నప్పటికీ, సంబంధిత శాఖలు స్పందించడం లేదని విమర్శిస్తున్నారు. అక్రమ రవాణాపై సమాచారం ఇచ్చినా అటవీ శాఖ అధికారులు ఘటన స్థలానికి వెళ్లి చర్యలు తీసుకోవాల్సిందిపోయి, ముడుపులు తీసుకుని లారీలను వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల ముందు నుంచే లారీలు వెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇంకా ఆశ్చర్యకర విషయం ఏమిటంటే, శుభకార్యాల కోసం పందిరి కొమ్మలు నరికినా జరిమానాలు విధించే అధికారులు, లారీల్లో పెద్దఎత్తున కలప తరలింపును మాత్రం ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నెలవారీ మామూల్ల మత్తులో అధికారులు బాధ్యతలు మరిచిపోయారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అటవీ సంపద అక్రమంగా కొల్లగొట్టబడితే భవిష్యత్ తరాలకు నష్టం జరుగుతుందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కఠిన చర్యలు తీసుకుని కలప అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలల పై చర్యలేవి

-రంగారెడ్డి జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల పై ప్రభుత్వ విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యమా -లేదా ప్రైవేటు పాఠశాలలతో ఒప్పందమా -హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆయిల్ శ్రీశైలం గౌడ్




మే04 (జర్నలిస్ట్ ఫైల్): తలకొండపల్లి రంగారెడ్డి జిల్లాలోని వివిధ మండల కేంద్రాలలో నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై స్పందిస్తూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను ఉల్లంఘించి తప్పుడు అనుమతులతో పాఠశాలలను నిర్వహిస్తున్న పట్టించుకోని విద్యాశాఖ అధికారులు అంటూ ప్రైవేటు పాఠశాలల తనిఖీలపై విద్యాశాఖ అధికారులు జాప్యం నిర్వహిస్తున్నారని దాదాపు గత 20 సంవత్సరాల నుండి ఇప్పటివరకు యదేచ్ఛగా పాఠశాలలను నిర్వహిస్తూ అధిక ఫీజులతో విద్యార్థులను మానసిక వేధింపులకు గురి చేస్తున్న యాజమాన్యం పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అదేవిధంగా విద్య ప్రాథమిక హక్కుగా (ఆర్టికల్ 21ఏ) భారత రాజ్యాంగంలోని 86వ సవరణ (2002) ద్వారా ఆర్టికల్ 21–ఏ ప్రకారం విద్యను ప్రాథమిక హక్కుగా మార్చారు.కాబట్టి ప్రైవేట్




పాఠశాలల్లో మరియు అన్‌ఎయిడెడ్ పాఠశాలలో కూడా 25 శాతం సీట్లను బలహీనవర్గాలకు మరియు ఆర్థికంగా వెనుకబడిన (ఈ డబ్ల్యూ ఎస్) పిల్లలకు ఉచితంగా అందించే విధంగా విద్య హక్కు చట్ట సవరణలు చేయడం జరిగింది.ఈ చట్ట సవరణలను అమలు చేసే విధంగా నిర్ణయాలు ఉండాలి కానీ ప్రభుత్వ విద్యాశాఖ అధికారులు ఈ ప్రైవేటు విద్యా పాఠశాలల పైన తనిఖీలు చేయకపోగా రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాలలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలైన అనుమతి పత్రాలు లేకున్నా తప్పుడు అనుమతి పత్రాలతో ప్రైవేటు పాఠశాలలకు విద్యాశాఖ అధికారులు ఇష్టానుసారంగా పాఠశాల ప్రారంభాలకు పర్మిషన్లు ఇవ్వడం జరిగిందని అసహనం వ్యక్తం చేస్తూ ఇప్పటికైనా ప్రైవేటు పాఠశాలల పై తనిఖీలు నిర్వహించి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అమలు జరిగే విధంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని లేనియెడల పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని శ్రీశైలం గౌడ్ తెలిపారు.

## కూతుబ్ షాహీ ఈద్గా స్థలం రక్షణకు ముందడుగు

- రాజ్యాంగ పరిరక్షణ వేదిక



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఈద్గా స్థల రక్షణకు సమాజం ముందడుగు ఖమ్మం నగరంలోని కుతుబ్ షాహి కాలానికి చెందిన పురాతన ఈద్గా స్థలం, ఖబరస్తాన్ ప్రాంతాలు ఆక్రమణల ముప్పును ఎదుర్కొంటున్నాయి. కొన్ని అసాంఘిక శక్తులు పవిత్ర ప్రదేశాలను అపవిత్రం చేస్తున్నాయనే ఆరోపణలతో స్థానిక ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో, వాటి రక్షణకు చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు నిరంతరం కోరుతున్నారు. ఈ సమస్యపై స్పందించిన రాజ్యాంగ పరిరక్షణ వేదిక పవిత్ర స్థలాల సంరక్షణ బాధ్యతను స్వీకరించింది. వేదిక జాతీయ అధ్యక్షుడు సాదిక్ అలీ మాట్లాడుతూ వక్ఫ్ భూములు మాత్రమే కాకుండా, అన్ని మతాలకు చెందిన పవిత్ర ప్రదేశాలను కాపాడేందుకు తమ వేదిక కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. పార్కింగ్ పేరుతో దుర్వినియోగం ఈద్గా ప్రాంగణాన్ని కొంతమంది వాహనాల పార్కింగ్ స్థలంగా ఉపయోగిస్తున్నారని, ఈద్గా స్థలంలో ఆపిన లారీలు ఆటోల మాటున అక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా మత్తు పదార్థాల వినియోగం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని అరికట్టేందుకు రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో "సంఘీ బూనియాద్ పోల్స్" ఏర్పాటు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పవిత్ర స్థలాలను రక్షించేందుకు ఇది ఒక కీలక చర్యగా భావిస్తున్నారు. ఐక్యతకు నిదర్శనంఆదివారం ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమానికి మోతీ మసీదు పెద్ద అబ్దుల్ ఘని ముఖ్య అతిథిగా హాజరై దువా చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



ఖమ్మం పట్టణ మైనారిటీ సోదరులందరూ పవిత్ర స్థలాల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, సమాజ ఐక్యతతోనే ఇటువంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సారధి నగర్ రాజ్యాంగ పరిరక్షణ వేదిక శాఖ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ గౌస్, ఆరిఫ్, నేలకొండపల్లి మండల అధ్యక్షులు షేక్ సుభాని, కూసుమంచి మండల అధ్యక్షులు ఖలీమ్, రాజ్యాంగ పరిరక్షణ వేదిక మున్నాభాయ్, హబీబ్, పెంటు సాహెబ్, నజీరుద్దీన్, ప్రముఖ న్యాయవాది నాగుల్ మీరా, చాంజాని, అల్లా బకాష్, జబ్బర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వివాహ జంటలను ఆశీర్వదించిన మల్లి బాబు యాదవ్



ఖమ్మం , మే 04 (జర్నలిస్ట్ ఫైల్) :ఖమ్మం రూరల్ మండలం మంగళ గూడెం గ్రామ సర్పంచ్ మేకల సత్యనారాయణ యాదవ్- నాగమణి దంపతుల కుమారుడు మనోజ్ యాదవ్ -రమ్యశ్రీ( వరంగల్ జిల్లా నెక్కొండ మండలం తోపన పెల్లి గ్రామానికి చెందిన వర్రె సాయిలు- సుజాత దంపతుల కూతురు ) ల వివాహం మంగళ గూడెం లోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఘనంగా జరిగింది. ఖమ్మం కార్పొరేషన్ 15వ డివిజన్ కొత్తగూడెం కు చెందిన మాజీ నీటిపారు దలసంఘం అధ్యక్షులు యర్రబోయిన శ్రీను -రేణుక దంపతులకుమారుడు యశ్వంత్ - విశ్వంతి( ఖమ్మం నగరం 15వ డివిజన్ కొత్తగూడెం కు చెందిన మరి మేకల ఉపేందర్ రావ్, గోపమ్మ దంపతుల కూతురు ) ల వివాహం కొత్తగూడెంలో జరిగింది. ఈ వివాహ కార్యక్రమాలలో మాజీ జెడ్పిటిసి డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పాల్గొని నూతన వధూవరుల జంటలకు అక్షింతలు వేసి కలకాలం చల్లగా ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తంగెళ్ల సాయి కృష్ణ శృతి మొరిమేకల కోటయ్య,సత్తి వెంకన్న,పొదిలి భూపతి, బంధుమిత్రులు మరియు తదితరులు పాల్గొన్నారు.



# కొత్తా సీతారాములకు ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ నేతలు



ఖమ్మం, మే 04 (జర్నలిస్ట్ ఫైల్) : జిల్లా ఐ యన్ టి యు సి అధ్యక్షులు కొత్తా సీతారాములు అధ్యక్షతన ఘనంగా ఐ యన్ టి యు సి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై అతిథి ఐ యన్ టి యు సి జెండాను ఎగురవేసిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్.జిల్లా ఐ యన్ టి యు సి అధ్యక్షులు కొత్తా సీతారాములు శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. జిల్లా, నగర ఐ యన్ టి యు సి బాధ్యుల ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా ఐ యన్ టి యు సి అధ్యక్షులు కొత్తా సీతారాములు అధ్యక్షతన ఐ యన్ టి యు సి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఐ యన్ టి యు సి జెండాను ఎగురవేశారు. అనంతరం జిల్లా ఐ యన్ టి యు సి అధ్యక్షులు కొత్తా సీతారాములు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, నగర ఐ యన్ టి యు సి అధ్యక్షులు నరాల సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ కొత్తా సీతారాములు కి ఐ యన్ టి యు సి సోదర సోదరీమణులకు ఆవిర్భావదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నిరంతరం ఐ యన్ టి యు సి శ్రేణులకు అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు.అనంతరం ఖమ్మం కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ కార్మిక సోదర సోదరీమణులకు ఐ యన్ టి యు సి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఐ యన్ టి యు సి శ్రేణులకు అందుబాటులో ఉన్నామని, ఎల్లప్పుడూ వారికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.అనంతరం జిల్లా, నగర ఐ యన్ టి యు సి నూతన కమిటీ బాధ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.తదనంతరం శ్రమశక్తి అవార్డ్ గ్రహీత కొత్తా సీతారాములు, మిషన్ భగీరథ శ్రమశక్తి అవార్డ్ గ్రహీత తలారి రాములు ను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ లు శ్రేణులతో కలిసి శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో వీరితో జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కిలారి అనిల్ నరేష్ నాయుడు,జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా ఎస్ సి సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య, కార్పొరేటర్ కమర్తపుమురళీ,పాల్వంచ కృష్ణ , ఐ యన్ టి యు సి వివిధ విభాగాల అధ్యక్షులు ,కార్యవర్గ సభ్యులు, ఐ యన్ టి యు సి శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా ఐ యన్ టి యు సి జిల్లా అధ్యక్షులు నూతి కుమార్, జిల్లా కాంగ్రెస్ నాయకులు రంగా జనార్ధన్, గజ్జి సూర్యనారాయణ మహ్మద్ ఫజల్,కలిమేల భద్రం, కొంగర సంగయ్య,రత్నాకర్,కోసూరి ప్రసాద్ , యం ఎస్ ఎన్ రెడ్డి,సిద్దాల గణేష్,రంగధం, ఎస్ వి రమణ,హనుమంతరావు,హరిబాబు,రామగిరి సాంబశివరావు,అమ్మాజీ,పూతగాని రమణ, అంజు బేగం,వీరేంద్ర రెడ్డి, సైదులు, వివిధ హోదాలలో ఉన్న ఐ యన్ టి యు సి నాయకులు పాల్గొన్నారు.



# విద్యతోనే తమ లక్ష్యాన్ని సాధించాలి

దేశానికి, కని పెంచిన తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి- భారతదేశం మంచి దేశంగా మార్చాల్సిన బాధ్యత యువకులు పైనే ఉంది : ఎస్ ఐ ఓ జాతీయ అధ్యక్షులు అబ్దుల్ హఫీజ్




ఖమ్మం, మే 04 (జర్నలిస్ట్ ఫైల్) : నేటి యువత విద్యతోనే తమ లక్ష్యాన్ని సాధించి దేశానికి, కని పెంచిన తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఎస్ ఐ ఓ జాతీయ అధ్యక్షులు అబ్దుల్ హఫీజ్ అన్నారు. స్థానిక భక్త రామదాసు కళా క్షేత్రం లో ఎస్ ఐ ఓ జిల్లాస్థాయి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముందుగా అతిథిగా పాల్గొన్న జమాతే ఇస్లామీ హింద్ జాతీయ కార్యదర్శి హమీద్ మహమ్మద్ ఖాన్ మాట్లాడుతు లౌకిక విద్యకే పరిమితం కాకుండా, ఉన్నతమైన ధార్మిక విలువలను అలవరుచుకోవాలని అల్లాహ్, ప్రవక్త చూపిన మార్గాన్ని అనుసరించడమే నిజమైన విజయమని ఆయన పేర్కొన్నారు. ఇష్టానుసారం కాకుండా, దైవం కోరుకున్న విధంగా జీవి తాన్ని గడపాలని సూచించారు. ప్రస్తుత సోషల్ మీడియా యుగంలో యువత బ్రాండెడ్ మొబైళ్ళు, బట్టలు, కార్ల వెంట పడుతూ వాటినే హోదాగా భావిస్తున్నారని, ఈ రంగుల ప్రపంచంలో పడి అసలైన జీవిత లక్ష్యాన్ని మరచిపోవద్దని హెచ్చరించారు అనంతరం తెలంగాణ జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాదిఖ్ అహ్మద్ మాట్లాడుతు నేటి యువత మద్యం జూదం బెట్టింగ్ మొబైల్ గేమ్ లాంటి చెడు మార్గాలను వదిలి, నవ సమాజ నిర్మాణానికి తోడ్పాటు అందించాలని దానికి కావాల్సిన వనరులను సమకూర్చుకోవాలని అన్నారు, ఎస్ ఐ ఓ తెలంగాణ అధ్యక్షులు ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతు యువత మనసులో శాంతి, ఆలోచనలో స్పష్టత కావాలంటే దైవ మార్గమే శరణ్యమని, యువత వ్యక్తిగత వికాసం మరియు సమాజ నిర్మాణం కోసం ఎస్ ఐ ఓ తో కలిసి నడవాలని కోరారు అనంతరం ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్ ఐ ఓ జాతీయ అధ్యక్షులు అబ్దుల్ హఫీజ్ మాట్లాడుతు యువకులు న్యాయం కోసం నిలబడానికి ముందుండాలని మరియు మంచి చేసే వారికి పూర్తి సహకారం అందించాలని అన్నారు ఇవాళ భారతదేశం మంచి దేశంగా మార్చాల్సిన బాధ్యత యువకులు పైనే ఉందని అన్నారు అది యువకులలో దైవము ఉంటేనే సాధ్యమవుతుందని అన్నారు ప్రస్తుత కాలంలో యువత అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. విద్యలో వెనుకబడటం, జీవితంలో స్పష్టమైన లక్ష్యం లేకపోవడం, నిరుద్యోగ భయం, సోషల్ మీడియా దుర్వినియోగం, మరియు నైతిక విలువల నుండి దూరమవడం, ప్రతిభ ఉన్నప్పటికీ, సరైన మార్గదర్శకత్వం లేక చాలామంది యువత దారి తప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాన్ఫరెన్స్ ద్వారా యువతకు దిశానిర్దేశం చేస్తూ, విద్య, లక్ష్య సాధన, నైతిక విలువలు మరియు సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించి వారిలో మనోధైర్యాన్ని నింపారు.చివరిగా ఇంటర్మీడియట్ నందు మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమొంటోస్ మరియు సర్టిఫికెట్ ద్వారా సత్కరించడం జరిగింది. కార్యక్రమానికి ముందు ఎస్.ఐ.ఓ కార్యకర్తలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొని జాతీయ అధ్యక్షుడిని ఓపెన్ టాప్ జీపులో జడ్ పి సెంటర్ నుండి సభా ప్రాంగణం భారీ బైక్ ర్యాలీ ద్వారా ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ ఓ ఆర్గనైజర్ సెక్రెటరీ అష్ఫాక్ అహ్మద అసిస్టెంట్ దావా సెక్రెటరీ అమేర్ ఉసామా, జమాఅతె ఇస్లామి హింద్ నగర అధ్యక్షులు జైనుల్ పాషా,సెంట్రల్ అధ్యక్షులు ఇంతియాజ్,సౌత్ అధ్యక్షులు సయ్యద్ నిజాముద్దీన్, నార్త్ అధ్యక్షులు మొహమ్మద్ యూసుఫ్ షరీఫ్, వెస్ట్ అధ్యక్షులు అబ్దుస్ సుబుర్, ఎస్ ఐ ఓ పట్టణ అధ్యక్షులు మతిన్ ,జిల్లా మీడియా సెక్రెటరీ అబ్దుల్ మలిక్ ,ఎంపీజే రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ ఖాసిం, ఐట రీజనల్ సెక్రెటరీ అబ్దుల్ ముజీబ్, ఎస్ ఐ ఓ సభ్యులు తౌసిఫ్ అహ్మద్ ఖాన్, మునీర్ అహ్మద్ ఖాన్, నాజిమ్ ,అసిల్, హంజా,అనస్, రయాన్ అబ్దుల్ రెహమాన్, అమాన్, హుజెఫా, అర్షాద్, ఖాజా జైద్, ఎజాజ్,అష్ఫాక్ మరియు పట్టణ నలువైపుల నుండి యువత విద్యార్థులు వారి తల్లిదండ్రులు అత్యధిక సంఖ్యలో హాజరైనారు.



## భద్రాచలం డిఎస్పీ గా అరుణ్ కుమార్




భద్రాచలం, మే 04 (జర్నలిస్ట్ ఫైల్) : భద్రాచలం డివిజనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డిఎస్పీ) గా అరుణ్ కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. భద్రాచలం ఏఎస్పీగా విధులు నిర్వహించిన విక్రాంత్ కుమార్ బదిలీపై వెళ్ళారు. ఆయన స్థానంలో అరుణ్ కుమార్‌ను ఎస్‌డీపీవో, డీఎస్పీగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేసిన అరుణ్ కుమార్ ఆదివారం భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భద్రాచలం డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అరుణ్ కుమార్‌కు పోలీసు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షాన అనేది మాటలకే పరిమితం

- కల్లాల్లో 30 రోజులుగా మొక్కజొన్నల బస్తాల దుస్థితి...

- నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి లేదంటే కలెక్టరేట్ ముట్టడిస్తాం బీఆర్ఎస్ హెచ్చరిక...




ఖమ్మం, చింతకాని,మే 04 (జర్నలిస్ట్ ఫైల్):"కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షాన ఉంటుందని చెప్పేది మాటలకే పరిమితం అనడానికి నిదర్శనం కల్లాల్లో కొట్టుమిట్టాడుతున్న మొక్కజొన్నల బస్తాల దుస్థితే" అంటూ బీఆర్ఎస్ పార్టీ చింతకాని మండల నాయకులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొన్న శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రైతులకు జరిగిన పంట నష్టం, కరెంట్ షాక్‌తో మృతి చెందిన గేదెల ఘటన, అలాగే కల్లాల్లో 20 నుంచి 30 రోజులుగా నిల్వ ఉన్న మొక్కజొన్నల బస్తాల దుస్థితిపై ఆదివారం కోదూమూరు గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శుక్రవారం చింతకాని మండలంలో చెలరేగిన మంటల్లో చింతకాని గ్రామానికి చెందిన దేశబోయిన వెంకటేశ్వర్లుకు చెందిన ఐదు లక్షల విలువైన ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైందని, ఆయనకు లక్ష రూపాయల పంట నష్టం కూడా వాటిల్లిందని తెలిపారు. అదే ఘటనలో కొమ్మిని పుల్లయ్య, పొనుగోటి ప్రసాద్ అనే ఇద్దరు రైతులకు చెందిన పంటలు కలిపి 2 లక్షల మేర కాలి బూడిదయ్యాయని చెప్పారు. పంట కాలిపోయి రెండు రోజులు అవుతున్నా ఇప్పటివరకు అధికారులు నష్టం అంచనా వేయలేదని మండిపడ్డారు. వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా నష్టాన్ని అంచనా వేయించి బాధిత రైతులకు ప్రభుత్వమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. చింతకాని మండల పరిధిలోని తిర్లాపురం, లచ్చగూడెం, తిమ్మినేనిపాలెం, బస్వాపురం గ్రామాల్లో అగ్నికి ఆహుతైన పంటలను కూడా లెక్కించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలన్నారు. ఇక లచ్చగూడెం గ్రామంలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్ల కరెంట్ షాక్‌తో గేదెలు మృతి చెందిన ఘటనపై స్పందిస్తూ, బాధితులకు ప్రభుత్వమే న్యాయం చేయాలని కోరారు. కాటాలు వేసి 20 నుంచి 30 రోజులు గడుస్తున్నా ఇంకా కల్లాల్లోనే మొక్కజొన్న బస్తాలు ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే వాటిని గమ్యస్థానానికి చేర్చాలని అన్నారు. బస్తాలు, లారీల కోసం టెండర్ వేసిన వ్యక్తులు ఏమయ్యారని, ఓట్లప్పుడు వీధులు తిరిగిన నాయకులు ఎక్కడికి వెళ్లారని నిలదీశారు. ప్రభుత్వ అలసత్వం వల్ల దళారులు తక్కువ ధరకు ధాన్యం కొంటున్నారని ఆరోపించారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున కలెక్టరేట్ ముట్టడిస్తామని చింతకాని మండల బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంకెన రమేష్, బొడ్డు వెంకట రామారావు, బొగరపు రాంబాబు, చిట్టినగర్ రాంబాబు, గురజాల హనుమంతరావు, గడ్డం శ్రీనివాసరావు, పొనుగోటి రత్నాకర్, వంకాయలపాటి లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లిని అధిక సంఖ్యలో దర్శించుకున్న భక్తులు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 04 (జర్నలిస్ట్ ఫైల్) : శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి) ఆదివారం సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో విచ్చేయడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుండే పరిసర గ్రామాల నుండే కాక జిల్లా నలుమూలల నుండేకాక ఇతర జిల్లాల నుండి భక్తులు అధికసంఖ్యలో విచ్చేసినారు. తమను చల్లంగా చూడాలని వేడుకుంటూ బోనాలు సమర్పించినారు. సందర్భంగా దేవాలయ ఆవరణలోని శ్రీ అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారికి అభిషేకములు నిర్వహించారు.



అన్నప్రాశనలు, వాహనపూజలు, తలనీలాలు, అమ్మవారికి ఒడిబియ్యం, చీరలు, కనుములు, తదితర మొక్కులను చెల్లించుకొని అమ్మవారిని, స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదములను స్వీకరించారు. భక్తులకు అవసరమైన ప్రత్యేక దర్శనమునకు క్యూలైన్లు, ఉచిత పులిహోర ప్రసాద వితరణ, మంచినీటి వసతి తదితర ఏర్పాట్లను దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్. రజనీకుమారి పర్యవేక్షించినారు.పై కార్యక్రమములు దేవస్థానంలో నిర్వహించ బడునని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఒక ప్రకటనలో తెలియచేశారు.

# రానున్న ఐదు రోజులు ఎండలు మరింత తీవ్రం

- 41° సెల్సియస్ నుండి 54° సెల్సియస్ వరకు ఎండ వేడిమి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** రానున్న ఐదు రోజుల పాటు జిల్లాలో ఎండల తీవ్రత అధికంగా ఉండనుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ రానున్న ఐదు రోజులలో వేసవి తీవ్రత (హీట్ ఇండెక్స్) అధికంగా ఉంటుందని సూచించిందని అన్నారు. 41° సెల్సియస్ నుండి 54° సెల్సియస్ వరకు ఎండ వేడిమి ఉండవచ్చని తెలియజేసిందన్నారు. గుంటూరు తూర్పు, మేడికొండూరు, కొల్లిపర, మంగళగిరి, పొన్నూరు ఫిరంగిపురం, చేబ్రోలు, పెదనందిపాడు, తాడేపల్లి, తాడికొండ, గుంటూరు పశ్చిమం, పెదకాకాని, కాకుమాను, తెనాలి, వట్టిచెరుకూరు, తుళ్ళూరు, దుగ్గిరాల, ప్రత్తిపాడు మండలాలు ఈ ప్రభావానికి లోన అయ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అత్యవసర పనులు ఉంటే మినహా ప్రజలు ఎవరు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు బయటకు రావద్దని ఆయన సూచించారు. అత్యవసర పనులకు బయటకు వస్తే గొడుగు ఉపయోగించాలని, వదులు దుస్తులు ధరించాలని, తగినంత నీటిని తాగాలని సూచించారు. చిన్నారులు, వయసు మీరినవారు బయటకు వెళ్లకుండా కుటుంబ సభ్యులు చూడాలని చెప్పారు. డీ హైడ్రేషన్ కు గురికాకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు టోపి, తలపాగా వంటివి ధరించాలన్నారు. చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని, కళ్ళ రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించాలన్నారు. గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగవద్దని సూచించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు చలివేంద్రియాలు ఏర్పాటు చేయాలని, అధికారులు ప్రజలకు ఎండ తీవ్రత పట్ల అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

# ఆపదలో ఆదుకునే అభయనేస్తం సిఎమ్ రిలీఫ్ ఫండ్



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సి ఎమ్ రిలీఫ్ ఫండ్ ద్వారా లభించే సాయం ఆపన్న నేస్తమని పట్టణ టిడిపి అధ్యక్షులు మహ్మద్ కుద్దూస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ చొరవ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి లభిస్తున్న ప్రాధాన్యత పట్ల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలొ, పట్టణానికి చెందిన పాలపర్తి ప్రమీల, పరుచూరి వెంకటరాజ ల, వైద్యసేవల నిమిత్తం, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవతొ, మంజూరైన 3,03,558,రూపాయల సి ఎమ్ రిలీఫ్ చెక్ ను, టౌన్ పార్టీ అధ్యక్షులు మహ్మద్ కుద్దూస్ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలొ పద్మశాలి వెల్ ఫేర్ కార్పోరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, టౌన్ టిడిని ప్రధానకార్యదర్శి వసంతం అశోక్ వర్ధన్, మల్లవరపు విజయ్, కనికరం యోగేష్, సయ్యద్ షావుల్, వులసి పూర్ణ, జాఫర్ తదితరులున్నారు.

# దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** దివ్యాంగులకు ఉపకరణాలను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పంపిణీ చేశారు. నలుగురు దివ్యాంగులకు ఒక్కొక్కటి రూ. 15 వేలు విలువ గల పరికరాలను విద్యా పరంగా ఉపయోగ నిమిత్తం అందించారు. ఉపకరణాలు సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్య అభ్యసనానికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జ్యోతి బసు, జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు ఎన్.వెంకటరవణప్ప పాల్గొన్నారు.

# జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులుగా కొప్పురావూరి కిషోర్



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** పట్టణంలోని 7వ, వార్డు తెలుగుదేశం సమన్వయకర్త ఆర్యవైశ్య యువ నాయకులు కొప్పురావూరి కిషోర్ ను, గుంటూరుజిల్లా ఆర్యవైశ్యయువజన సంఘం అధ్యక్షులుగా రాష్ట్ర ఆర్యవైశ్యయువజన సంఘం సోమవారం నియమించి. తన నియామకానికి తోడ్పడిన, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ఇల్లూరి లక్ష్మయ్య, గౌరవ అధ్యక్షులు టిజె. వెంకటేష్, మహాసభ గౌరవ అధ్యక్షులు చిన్నిరామ సత్యన్నారాయణ,పెనుగొండ సుబ్బరాయుడు, కాళ్ళకూరి నాగబాబు, మాటూరి రంగనాద్ లకు కిషోర్ ధన్యవాదాలు తెలిపారు. జిల్లా ఆర్యవైశ్యయువజన సంఘం అధ్యక్షులుగా కిషోర్ నియమితులు కావడం పట్ల, పట్టణంలోని వాసవీయూత్, ఆర్యవైశ్యయువత, యువజనసంఘం, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్, టిడిపి వాణిజ్యవిభాగం, ఆర్కెయూత్ సభ్యులు తమ ఆనందం వ్యక్తం చేస్తు అభినందనలు తెలిపారు.

# పేదల కష్టంలో అండగా ఎమ్మెల్యే నసీర్

- మోతీలాల్ నగర్ నిర్వాసితులకు ఆర్థిక సాయం
- 40 కుటుంబాలకు రూ.2 లక్షలు అందజేత
- అందరికీ న్యాయం జరిగేలా చూస్తానని భరోసా



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** మోతీలాల్ నగర్ నిర్వాసితులను నా సొంత కుటుంబ సభ్యులుగా భావించి అండగా నిలుస్తాననే మాటపై నిలబడతానని, ఏ కష్టమొచ్చినా తోడుగా ఉంటానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. సోమవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో మోతీలాల్ నగర్ నిర్వాసితుల్లో 40 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 5 వేలు చొప్పున రూ. 2 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తామని తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో, అభివృద్ధిలో భాగంగానే మోతీలాల్ నగర్ లో ఇళ్ల కూల్చివేత చేపట్టారని చెప్పారు. నిర్వాసితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి చేశాక ఖాళీ చేయించామని తెలిపారు. తొలుత వారికి కేటాయించిన కొర్నెపాడు ప్లాట్లలో ఇళ్ల కేటాయింపునకు చర్యలు తీసుకున్నామని, కానీ అక్కడ సాధ్యపడకపోవడంతో చౌడవరంలో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేశామని తెలిపారు. మోతీలాల్ నగర్ వాసుల్లో అధికశాతం మంది కూలీలు కావడంతో ప్రయాణ ఖర్చులు అధికమవుతాయనే ఉద్దేశంతో గుంటూరులోనే అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారని చెప్పారు. మోతీలాల్ నిర్వాసితులకు తాను చెప్పిన విధంగా ఆర్థిక సాయం అందిస్తున్నానని, ఇదే కాకుండా ఎలాంటి అవసరం వచ్చినా ఆదుకునేందుకు ముందుంటానని భరోసా కల్పించారు. వైసీపీ నాయకులు పని గట్టుకుని దుష్ప్రచారం చేస్తే ప్రజలు సహించబోరని హెచ్చరించారు. గత పదేళ్లలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి ఆనవాళ్లు ఎక్కడా కనిపించ లేదని, తాము అధికారం చేపట్టిన కేవలం 18 నెలల కాలంలోనే వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. అభివృద్ధి అనే పదానికి అ-ర్థం తెలియని వాళ్లు పేదల ఇళ్లపై రాజకీయం చేస్తుంటే ప్రజలు చీదరించుకుంటున్నారని మండిపడ్డారు. మోతీలాల్ నగర్ వాసులు నివాసాలపై ఆందోళన పడాల్సిన అవసరం లేదని చెప్పారు.

# పొలిట్ బ్యూరో సభ్యురాలు ఎమ్మెల్యే గళ్ళా మాధవికి అభినందనల వెల్లువ

- ఫిజియోథెరఫిస్ట్ ఫెడరేషన్ ప్రతినిధుల మర్యాదపూర్వక భేటీ
- సమస్యలపై స్పందించిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలిగా నియమితులైన గళ్ళా మాధవిని ఆమె క్యాంపు కార్యాలయంలో పలువురు నాయకులు, ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ వెంకటేష్ యాదవ్ ఎమ్మెల్యే గళ్ళా మాధవిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా, ఫిజియోథెరఫిస్ట్ ఫెడరేషన్ - ఆంధ్రప్రదేశ్ సంఘ సభ్యులు సోమవారం ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా. బాపట్ల వెంకట హరికృష్ణ, కార్యదర్శి డా. సుభాని తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఫిజియోథెరఫీ రంగానికి ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫిజియోథెరపీ విభాగాలను ఆధునీకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. వారి వినతులను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి, సంబంధిత అంశాలను పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైన పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డా. ఏడుకొండలు, డా. ఇమ్రాన్ ఖాన్, డా. రాజేంద్ర ప్రసాద్, డా. దయాకర్ రావు, డా. నాగ జ్యోతి, హారిక ఫిజియోథెరపీ కాలేజీ ఫిజియోథెరపిస్టులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# ఎస్.ఎం.ఏ.ఎం పథకం క్రింద రాయితీపై వ్యవసాయ పరికరాలు

- జిల్లాకు రూ.3.04 కోట్లు కేటాయింపు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలోని రైతులు సాగుకు ఉపయోగించే యంత్ర పరికరాలను సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్ (SMAM) పథకం క్రింద రాయితీ పై ఇచ్చేందుకు వ్యవసాయ శాఖ సిద్ధమైందని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందు కోసం జిల్లాకు రూ. 3.04 కోట్లు కేటాయిశీచిందన్నారు. రైతులకు అవసరమైన పవర్ టిల్లర్లు, రోటోవేటర్లు, హార్వెస్టింగ్ త్రేషర్లు, పురుగు మందులు పిచికారి చేసేందుకు ఉపయోగించే స్ప్రేయర్లు ఇవ్వనున్నారన్నారు. వీటితోపాటు నూర్పిడి యంత్రాలు, విత్తన గొర్రులు, ట్రాక్టర్ తో పనిచేసే వ్యవసాయ అనుబంధ పరికరాలు, 40 హెచ్ పీ వరకు సామర్థ్యం కలిగిన రెండు మరియు నాలుగు చక్రాల ట్రాక్టర్లను కూడా రైతులకు రాయితీ పై అందచేయనున్నారని తెలిపారు. పరికరాలు కొనుగోలు చేయుటకు ఎస్సి, ఎస్టి, చిన్న, సన్నకారు, మహిళా రైతులకు, పరికరాల ఖర్చులో 50 శాతం, మిగత రైతులకు 40 శాతం రాయితీని ప్రభుత్వం భరిస్తుందన్నారు. పరికరములు అవసరమైన వారు రైతు సేవ కేంద్రాలు, మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. త్వరలో దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందని అన్నారు. ఈ దరఖాస్తులను పరిశీలించి ఎంపిక చేసేందుకు జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో వ్యవసాయ, ఉద్యాన, అగ్రోస్ మరియు శాస్త్రవేత్తలతో ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆన్లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి జాయింట్ కలెక్టర్ సమక్షంలో పూర్తి పారదర్శకతతో లబ్దిదారుల ఎంపిక చేయడం జరుగుతుందని చెప్పారు. భూమి యజమానులతో పాటు ఆర్.ఓ.ఎఫ్.ఆర్ రైతులు, గత మూడు సంవత్సరాల్లో కనీసం మూడు సీజన్లలో ఇ-పంట అప్లికేషన్‌లో నమోదు అయిన సి.సి.ఆర్.సి కలిగిన రైతులు అర్హులన్నారు. 2024--25 సంవత్సరంలో సబ్సిడీ పొందిన లబ్ధిదారులు అర్హులు కాదన్నారు. ౹ాహీూవీ పథకం కింద ఒక కుటుంబం నుండి ఒక్క సభ్యుడు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు.

# పి.జి.ఆర్.ఎస్‌కు 433 అర్జీలు : జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో పి.జి.ఆర్.ఎస్ కు మొత్తం 199 అర్జీలు అందాయి. అందులో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 199, పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్‌కు 163 అర్జీలు, గుంటూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో 5 అర్జీలు, తెనాలి రెవిన్యూ డివిజన్ పరిధిలో 24 అర్జీలు, గుంటూరు నగర పాలక సంస్థకు 36, మిగిలిన మున్సిపాలిటీల పరిధిలో 6 అర్జీలు అందాయి.

సోమవారం ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.

అర్జీదారులు పింఛన్లు, రేషన్ కార్డులు, గృహాలు మంజూరు చేయాలని, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ అర్జీలను సమర్పించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ గంగ రాజు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు,పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.రమణ, ఇన్ ఛార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రావణ్ బాబు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా పర్యాటక అధికారి రమ్య, దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ మాధవి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

**వినుకొండ ( జర్నలిస్ట్ ఫైల్ ):** పట్టణంలోని టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులను ప్రభుత్వ చీఫ్ విప్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు సందర్శించారు. నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్లను పరిశీలించిన ఆయన, పనుల పురోగతిపై మున్సిపల్ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మౌలిక సదుపాయాల కల్పనలో ఎక్కడా రాజీ పడకూడదని, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.



ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. 2014-19 మధ్యకాలంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు నాయుడు ప్రభుత్వాల సమన్వయంతో వినుకొండకు మొత్తం 4,096 టిడ్కో ఇళ్లను మంజూరు చేశామని గుర్తు చేశారు. అయితే, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాజకీయ కక్షతో అందులో 2,656 ఇళ్లను రద్దు చేసి, పేద ప్రజల సొంతింటి కలపై నీళ్లు చల్లిందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా సుమారు 55 వేల ఇళ్లను రద్దు చేసి పేదలను దగా చేశారని ఆయన విమర్శించారు.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిలిచిపోయిన పనులపై దృష్టి సారించిందని జీవీ పేర్కొన్నారు. సుమారు రూ. 114.55 కోట్ల భారీ వ్యయంతో ఇళ్ల నిర్మాణం, ఇన్ఫ్రాస్ట్రక్చర్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఇప్పటికే 720 అపార్ట్‌మెంట్ ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తయ్యిందని, మిగిలిన సంపులు, ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్లు, సిమెంట్ రోడ్ల పనులను రానున్న ఐదు నెలల్లోగా పూర్తి చేసి లబ్ధిదారులకు గృహప్రవేశం చేయిస్తామని హామీ ఇచ్చారు. పేద ప్రజలు అన్ని వసతులతో గౌరవంగా, ఆనందంగా బతకాలన్నదే తమ ప్రభుత్వ ఆశయమని అన్నారు.

ముఖ్యంగా ఈ నివాస సముదాయాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేకంగా సబ్ స్టేషన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, మరో మూడు నెలల్లో దీనిని పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని చెప్పారు. వీటితో పాటు అంగన్‌వాడీ కేంద్రం, హెల్త్ సెంటర్ వంటి మౌలిక సదుపాయాలను కూడా ఇక్కడే కల్పిస్తున్నామని తెలిపారు. గత ఎమ్మెల్యే స్వార్థం కోసం పట్టణానికి 7 కిలోమీటర్ల దూరంలో, కొండల ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చి పేదలకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వినుకొండ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, అందులో భాగంగా రామలింగేశ్వర స్వామి దేవాలయ చుట్టూ రూ. 4 కోట్లతో ప్రాకారం మరియు ఘాట్ రోడ్డు నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు.

**ఎన్నికల ఫలితాలపై స్పందన:**

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై జీవీ ఆంజనేయులు స్పందించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ఘనవిజయం సాధించి తొలిసారి అధికారంలోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఎన్డీయే ప్రతిష్టకు ఇది నిదర్శనమని, అస్సాంలో తిరిగి అధికారాన్ని నిలబెట్టుకోవడం మరియు పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి విజయం సాధించడం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి ప్రతీక అని కొనియాడారు. ఈ ఫలితాలు దేశవ్యాప్త ఎన్డీయే ప్రభంజనాన్ని సూచిస్తున్నాయని పేర్కొంటూ, విజయం సాధించిన అన్ని పక్షాలకు ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

# పాఠశాల బస్సుల భద్రతా ప్రమాణాల తనిఖీ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** పాఠశాల బస్సుల భద్రతా ప్రమాణాల తనిఖీ చేస్తున్నట్లు ఉప రవాణా కమీషనర్ కే సీతారామిరెడ్డి తెలిపారు. సోమవారం నుండి పలు పాఠశాలల వాహనాలను తనిఖీ చేయడం జరిగిందని చెప్పారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమములో భాగంగా గుంటూరు జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల బస్సుల భద్రతా ప్రమాణాలును మోటారు వాహన తనిఖీ అధికారులు తనిఖీ చేస్తున్నారని వివరించారు. పాఠశాల బస్సులు రహదారిపై ప్రయాణించడానికి ఎంత వరకు అనుకూలంగా ఉన్నాయో పరిశీలించడం, అలాగే తనిఖీలో గుర్తించిన లోపాలను సరిదిద్ది బస్సులను సిద్ధం చేసుకోవాలని విద్యా సంస్థల యాజమాన్యాలకు సూచించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ కార్యక్షంలో భాగంగా ఇప్పటివరకు వరకు విద్యా సంస్థలకు చెందిన 106 బస్సుల భద్రతా ప్రమాణాలును తనిఖీ చేయడంజరిగిందన్నారు. మోటార్ వాహన తనిఖీ అధికారి సూచించిన భద్రతా ప్రమాణాలును విద్యా సంస్థల యాజమాన్యాలు స్కూల్ బస్సులకు పాటించి మే 10వ లోగా ఆటోమేటెడ్ ఫిట్నెస్ సెంటర్ల వద్ద ఫిట్నెస్ సర్టిఫికెట్ పొందాలని విజ్ఞప్తి చేశారు.

# సాంఘీక నాటకరంగానికి కొసరాజు సేవలు నిరుపమానం



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** సాంఘీక నాటక రంగానికి నటుడుగా, రచయితగా, దర్శకుడుగా కొసరాజు మల్లిఖార్జునరావు అందించిన సేవలు నిరుపమానమని కళాకారులు మల్లిఖార్జునరావు వర్ధంతి వేళ ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక ఇస్కఫ్ కార్యాలయంలొ, సోమవారం అభ్యుదయ కళాసమితి కళాకారులు, దివంగత కొసరాజు మల్లిఖార్జున రావు వర్ధంతిని పురస్కరించుకుని, నిర్వహించిన కార్యక్రమంలొ కళాకారులు మల్లిఖార్జునరావు చిత్రపటం చెంత పువ్వులుంచి ఘనంగా నివాళులు అర్పించారు. మల్లిఖార్జున రావు, సహచర నటులు బ్రంహ్మాచార్యులు, దేవిశెట్టి కృష్ణారావు, అలపర్తి వెంకటేశ్వర్రావు, బెల్లం కొండ వెంకట్ లు, మల్లిఖార్జునరావుతో తమ నాటక రంగ ప్రయాణ సంఘటనలను గుర్తు చేస్తు ఘనంగా నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలొ సీనియర్ నాయకులు బొల్లిముంతకృష్ణ, శ్రీదేవి,బాలస్వామి, చందు సుబ్బారావు, డైరీ ప్రసాద్, స్వామి, ఛార్లీ తదితరులు పాల్గొన్నారు.

# జలధార పనులు త్వరగా ప్రారంభించాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** జలధార జలహారతి పనులు త్వరగా ప్రారంభం కావాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. జలధార, పి.జీ.ఆర్.ఎస్, రిసర్వే, ఉపాధి హామీ తదితర అంశాలపై సోమవారం జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలధార జలహారతి పనులు మంజూరు అయినప్పటికీ, పనులు ప్రారంభించడంలో జాప్యం జరుగుతున్నట్లు ఆన్ లైన్ లో కనిపిస్తున్నారు. పనులు త్వరగా ప్రారంభం చేయడమే కాకుండా వాటిని వెంటనే ఆన్ లైన్ లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలు పరిష్కరించుటకు ఆయా అర్జీలపై 48 గంటలలో చర్యలు చేపట్టాలని అన్నారు. జన గణన వేగవంతం చేయాలని, సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కారం చేసుకుంటూ జన గణన చేయాలని సూచించారు. పట్టాదారు పాసుపుస్తకాలను బుధవారం నాటికి పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. రిసర్వే చేయుటకు ముందుగా ప్రజలకు నోటీసులు అందించాలని, ఇకెవైసి చేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షలను తనిఖీ చేసిన జేసీ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** పరీక్షలను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదివారం తనిఖీ చేశారు. గుంటూరు పట్టణంలో ఏసీ కళాశాల, మహిళ కళాశాల, హిందూ కళాశాలలో జరుగుతున్న పరీక్షల తీరును గమనించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# రాష్ట్రంలో బీజేపీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలి



- ప్రశిక్షణ మహా అభియాన్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

**తిరుపతి(జర్నలిస్ట్ ఫైల్) :** తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలంలో సోమవారం నిర్వహించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ ఆవిర్భావం, సిద్ధాంతాలు, అంత్యోదయ లక్ష్యాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన అంత్యోదయ సూత్రం బీజేపీ పాలనకు మార్గదర్శకమని తెలిపారు. సమాజంలోని చివరి వ్యక్తి అభ్యున్నతి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని, అదే దిశగా కేంద్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. దేశ అభివృద్ధిలో ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు కల్పించడమే బీజేపీ ధ్యేయమని పేర్కొన్నారు.
ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తోందని, పారదర్శక పాలన, జాతీయ భద్రత, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు మద్దతు తెలుపుతున్నారని అన్నారు. పార్టీ కార్యకర్తలు సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజలతో అనుసంధానం పెంచుకోవాలని సూచించారు.
రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని, ప్రతి కార్యకర్త సేవాభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పార్టీ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలు అత్యుత్తమ ఫలితాలు సాధించడం హర్షనీయం



- ఎంఈఓ 1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడం హర్షణీయమని ఎంఈఓ 1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యా శాఖ అమలు చేసిన వందరోజుల యాక్షన్ ప్లాన్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదపడిందన్నారు. అదేవిధంగా రాష్ట్ర చరిత్రలో ఎస్ ఎస్ సి ఫలితాల్లో 595 మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థుల ఫోటోలను ప్రముఖ దిన పత్రికల్లో ప్రచురించి అభినందనలు తెలియజేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. అదేవిధంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులను నూతన విద్యా విధానాలను పరిశీలించేందుకు ఇతర దేశాలకు పంపించడం మంత్రి నారా లోకేష్ వినూత్న ఆలోచనలను అభినందిస్తున్నట్లు సామల పేర్కొన్నారు.


# హజ్‌కు బయలుదేరిన 185 మంది ఏపీ యాత్రికులు



- హైదరాబాద్ హజ్ క్యాంపు వద్ద వీడ్కోలు పలికిన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్, మైనారిటీ వ్యవహారాల సలహాదారుడు ఎంఏ షరీఫ్
- ఆధునిక వసతులు కల్పించిన ప్రభుత్వానికి హాజీల కృతజ్ఞతలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాద్ ఎంబార్కేషన్ కేంద్రం శంషాబాద్ విమానాశ్రయం నుండి 185 మంది ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన యాత్రికులు హజ్ యాత్రకు సోమవారం బయలుదేరి వెళ్లారు. విడిది కేంద్రం నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి బయలుదేరిన హాజీల తరలింపు వాహనాలను మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్, మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు యమ్ఏ షరీఫ్, మైనారిటీ శాఖ కార్యదర్శి సిహెచ్ శ్రీధర్, హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష, సభ్యులు, సీఈఓ గౌస్ పీర్ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు మొదటి విమానం, ఆ తర్వాత రెండు విమానాల్లో మొత్తం 185 మంది యాత్రికులు హజ్ కు బయలుదేరి వెళ్లినట్లు మైనారిటీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో ఏర్పాటు చేసిన వసతి విడిది కేంద్రంలో ఆధునిక సౌకర్యాలతో ఆంధ్రప్రదేశ్ కు చెందిన యాత్రికులకు కూటమి ప్రభుత్వం నేతృత్వంలో మైనారిటీ మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో భారీగా ఏర్పాట్లు జరిగాయి. ఏపీ నుంచి 1202మంది యాత్రికులు హజ్ కు వెళ్లేందుకు హైదరాబాద్ ఎంబార్కేషన్ కేంద్రం ఎంపిక చేసుకోవడం జరిగిందని మంత్రి ఫరూక్ తెలిపారు. వీరందరూ ఈనెల 21వ తేదీ వరకు దశలు వారిగా శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరి వెళ్లడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర హజ్ యాత్రికులకు ఇతర రాష్ట్రాలలోని ఎంబార్కేషన్ కేంద్రాల వద్ద ప్రత్యేకంగా విడిది వసతి సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విడిది, భోజన, ప్రార్థన వసతులతో పాటు వైద్య శిబిరాలు, కరెన్సీ మార్పిడి, వీసా పత్రాల పరిశీలన, బోర్డింగ్ పాసుల జారీ తదితర అంశాలపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం ద్వారా వారికి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి విశదీకరించే ఏర్పాట్లు, సహాయ సహకారాల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. గత నెల 18,19 వ తేదీలలో విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం గన్నవరం విమానాశ్రయం నుంచి పవిత్ర హజ్ యాత్రకు 333 మంది యాత్రికులు వెళ్లిన విషయం తెలిసిందే. హైదరాబాద్ ఏంబార్కేషన్ కేంద్రం సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వసతి విడిది సౌకర్యాలు, పర్యవేక్షణ ఏర్పాట్లు పకడ్బందీగా, ఘనంగా జరిగాయని హజ్ యాత్రకు వెళు తున్న హాజీలు సంతోషం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# గ్లోబల్ బ్రాండ్లుగా స్థానిక ఉత్పత్తులు



- పారిశ్రామిక క్లస్టర్లకు లాజిస్టిక్స్ కనెక్టివిటీ
- రవాణా వ్యయం తగ్గించటమే కీలకమైన అంశం
- ఇండస్ట్రీ- ఇన్ఫ్రా- టూరిజం అంశాలపై ప్రత్యేక దృష్టి
- ఏపీలో ప్రాడెక్టు పర్ఫెక్షన్ క్లస్టర్లపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తయారయ్యే ఉత్పత్తులు గ్లోబల్ బ్రాండ్లుగా ఎదిగేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని పారిశ్రామిక క్లస్టర్లకు రోడ్డు, రైల్, పోర్టు కనెక్టివిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీ సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో సోమవారం ప్రాడెక్టు పర్ఫెక్షన్ క్లస్టర్లపై సీఎం సమీక్ష నిర్వహించారు. సమీక్షలో భాగంగా విశాఖ ఎకనామిక్ రీజియన్, అమరావతి ఎకనామిక్ రీజియన్, తిరుపతి ఎకనామిక్ రీజియన్ ప్రాంతాల్లో అభివృద్ధి చేయనున్న పారిశ్రామిక క్లస్టర్లపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన పథకం( భవ్య పథకం) కింద చేపట్టనున్న పారిశ్రామిక పార్కులు, కెమికల్ పార్కుల అభివృద్ధి పై సీఎం చర్చించారు. 2026-27లో ఏర్పాటు కానున్న రేర్ ఎర్త్ మినరల్ పార్క్ ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్, కంటైనర్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ సహా 175 ఎంఎస్ఎంఈ పార్కులను క్లస్టర్ల వారీగా అభివృద్ధి చేసే అంశంపై సమీక్షలో చర్చించారు. పారిశ్రామిక పార్కుల్లో ప్రాడెక్టు పర్ఫెక్షన్ తో పాటు లాజిస్టిక్స్ ను కూడా అనుసంధానం చేయాలని సీఎం సూచించారు. నీరు, విద్యుత్, కోల్డ్ చైన్, వేర్ హౌసింగ్ లాంటి మౌలిక సదుపాయాలు ఈ లాజిస్టిక్స్ పార్కులకు అనుసంధానమయ్యేలా చూడాలన్నారు. ప్రత్యేకించి రవాణా వ్యయం తగ్గితే ప్రయోజనం కలుగుతుందని స్పష్టం చేశారు. పారిశ్రామిక క్లస్టర్లకు రైల్, రోడ్, పోర్టు కనెక్టివిటీ జరిగేలా లాజిస్టిక్స్ ఇంటిగ్రేషన్ మ్యాపింగ్ జరగాలని సూచనలు చేశారు.

**ఇండస్ట్రియల్ టౌన్ షిప్ ల అభివృద్ధి :** స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులకు నాణ్యత పెరిగితేనే గ్లోబల్ స్థాయికి చేరుతాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉత్పత్తులకు స్థానికంగా, ప్రాంతీయంగా, దేశ, విదేశీ మార్కెట్లకు చేరేలా చూడాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎంఎస్ఎంఈల్లోని ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలతో తయారయ్యేలా ప్రోత్సాహం కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. పారిశ్రామిక క్లస్టర్లలో ఫార్మర్స్ ప్రోడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను ఏర్పాటు చేయటం ద్వారా రైతులకూ ప్రయోజనం కల్పించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన భవ్య పథకం ద్వారా రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో రసాయనాల తయారీ పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమలు- మౌలిక సదుపాయాలు- పర్యాటకం అనే విధానంలో ప్రణాళికలు చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ప్రతీ జిల్లాలోనూ ఓ మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెద్ద ఎత్తున కలుగుతాయన్నారు. ప్రతీ పారిశ్రామిక క్లస్టర్ వద్దా ఇండస్ట్రియల్ టౌన్ షిప్ ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్ కార్యక్రమం ద్వారా ఏపీ ఎంఎస్ఎంఈల స్థాపనలో అగ్రస్థానంలో ఉండాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్మెంట్ జరగాలన్నారు. నైపుణ్యాభివృద్ధి కోసం యూనివర్సిటీల్లోనూ కోర్సులను హైబ్రీడ్ విధానంలో అందించే ఆలోచన చేయాలన్నారు. సమీక్షకు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, సీఎస్ సాయి ప్రసాద్, పరిశ్రమలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాలు, అటవీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# "యోగా డే" సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు

- నిర్వహణపై మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆయుష్ అధికారులతో సమీక్ష
- త్వరలో మరోమారు భేటీ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వచ్చే నెల (జూన్) 21వ తేదీన 'అంతర్జాతీయ యోగా డే' పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబోతున్నారు. ఈ విషయమై తొలి సన్నాహక సమావేశం రాష వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధ్యక్షతన సోమవారం సాయంత్రం విజయవాడలోని ఆయుష్ ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, యోగాసనాల ప్రాధాన్యంపట్ల ప్రజల్లో మరింత అవగాహన పెంచాలని, ఇందుకు సంబంధించిన కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉద్యోగులు, యోగా, రోటరీ, లయన్స్ క్లబ్, ఇతర సమాజ సేవా సంస్థల వారిని భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న యోగా ట్రైనర్లతో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించి కార్యక్రమాల నిర్వహణపై వారి అభిప్రాయాలు తెలుసుకోవాలని సూచించారు. గతేడాది నిర్వహించిన కార్యక్రమాలకు కొనసాగింపుగా తదుపరి చర్యలు ఉండాలని పేర్కొన్నారు. అమరావతి పరిధిలో రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. దీనికి అనుగుణంగా జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ల నేతృత్వంలో యోగా డే కార్యక్రమాలు ఉండాలన్నారు. వేసవి సెలవుల అనంతరం జూన్ రెండో వారం నుంచి విద్యా సంస్థలు పునః ప్రారంభమవుతాయని తెలిపారు. వీరిలో యోగాసనాలపట్ల అవగాహన పెంచడం వల్ల విస్తృత ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. ఈ చర్యలు స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు కూడా దోహదశీచేస్తాయన్నారు

**గత ఏడాది యోగా డే కార్యక్రమాల ప్రభావంపై ఆరా..! :** మండల స్థాయి నుంచి యోగాసన కార్యక్రమాలు జరపాలని మంత్రి సత్య కుమార్ పేర్కొన్నారు . గత ఏడాది అంతర్జాతీయ యోగా డే సందర్భంగా భారీ స్థాయిలో నిర్వహించిన కార్యక్రమాలు, వాటి ప్రభావం గురించి మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై నివేదిక కూడా సిద్ధం చేయాలని ఆయుష్ ఇంచార్జ్ కమిషనర్ రోణంకి గోపాలకృష్ణను ఆదేశించారు. ప్రకృతి రంగ నిపుణులు, యోగా అండ్ నేచురోపతి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు సమావేశంలో మాట్లాడుతూ, యోగాసనాలు, అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని తెచ్చేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు చర్యలపై పలు ముఖ్యమైన సూచనలు చేశారు. యోగా డే కార్యక్రమాల నిర్వహణపై మంత్రి సత్య కుమార్ యాదవ్ త్వరలోనే మరో మారు

# పిఆర్‌సి కమిటీ నియమించి ఐఆర్ 30 శాతం ప్రకటించాలి - ఆప్టా




**అనంతపురం(జర్నలిస్ట్ ఫైల్):** అనంతపురం ఉపాధ్యాయ భవన్ యందు ఎ పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(ఆప్టా)అనంతపురం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశం నకు ఎ పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్( ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్ రావు ముఖ్య అతిథిగా హాజరు కావడం జరిగిందిసమావేశం యందు ప్రకాష్ రావు మాట్లాడుతూ రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం అధికారం లో వచ్చిన కొత్త లో రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఉద్యోగుల వలనే అధికారం లో రావడం జరిగింది వారికి అన్ని విధాలుగా మంచి చేస్తాం అని చెప్పారు, కానీ పి ఆర్ సి కమిటీ గడువు తీరి పోయి ముప్పై మూడు నెలల కాలం అయిపోయినా దాని ఊసు కూడా ఎత్తటం లేదు, పైగా మమ్మల్ని ఊపిరి పీల్చుకొనివ్వండి అని అంటున్నారు. గతా ప్రభుత్వం మీద వచ్చిన ఉద్యోగ మరియు ఉపాధ్యాయుల వ్యతిరేక భావం ఇప్పుడు ఈ ప్రభుత్వం మీద కూడా మొదలు అవుతుంది అనే విషయాన్ని గుర్తించటం లేదు. ఇప్పటికన్నా కళ్ళు తెరిచి పి ఆర్ సి కమిటీ నియామకం మరియు ఐ ఆర్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశం యందు అనంతపురం ఆప్టా అధ్యక్షుడు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ సరెండర్ లీవ్ బిల్లులు గత నాలుగు ఏళ్లు గా పెండింగ్ లో ఉన్నాయి. వాటిని వెంటనే చెల్లింపులు జరపాలని అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట రత్నం మాట్లాడుతూ డి ఏ లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా ఆర్థిక కార్యదర్శి బి ఏ శంకరమూర్తి, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చల్లా శివానంద, జిల్లా నాయకులు వలి ,నారాయణ శ్రీనివాసులు మరియు అనంతపురం జిల్లాలోని వివిధ మండల అధ్యక్షుడు మరియు ప్రధాన కార్యదర్శిలు ,కర్నూలు జిల్లా మున్సిపల్ కార్పొరేషన్ ఆప్టా అధ్యక్షులు లక్ష్మానాయక్ పాల్గొన్నారు

# ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్‌కు బీజేపీ మాధవ్ జన్మదిన శుభాకాంక్షలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** భారత ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌కు ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో సామాన్య కార్యకర్త స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి ఉప రాష్ట్రపతి పదవిని అలంకరించడం ఆయన విశిష్టతను చాటుతుందని పేర్కొన్నారు. రాధాకృష్ణన్ ప్రస్థానం భావితరాలకు స్ఫూర్తిదాయకమని, సుదీర్ఘ రాజకీయ అనుభవంతో ప్రజల పట్ల అంకితభావంతో సేవలందిస్తున్నారని తెలిపారు. ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అభిప్రాయపడ్డారు. ఉప రాష్ట్రపతి ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ, ఆయన నాయకత్వంలో దేశం మరింత అభివృద్ధి సాధించాలని మాధవ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# మూడు రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం - గుంటూరులో హోరెత్తిన సంబరాలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ మూడు రాష్ట్రాల్లో విజయ దుందుభి మోగించడంతో పాటు పశ్చిమ బెంగాల్‌లో తొలిసారిగా అధికారం సాధించిన సందర్భంగా గుంటూరులో ఘనంగా విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో లక్ష్మీపురం సెంటర్‌లోని వాజ్‌పేయి సర్కిల్ వద్ద కార్యక్రమం జరిగింది. ముందుగా వాజ్‌పేయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, అనంతరం టపాసులు పేల్చి మిఠాయిలు పంచుకున్నారు.
ఈ సందర్భంగా చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో సాధించిన విజయం కార్యకర్తల త్యాగఫలితమని పేర్కొన్నారు. అస్సాంలో మూడోసారి, పుదుచ్చేరిలో రెండోసారి విజయం సాధించడం ద్వారా బీజేపీపై ప్రజల విశ్వాసం మరింత బలపడిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన వికసిత భారత్ లక్ష్యాలకు ప్రజల మద్దతే ఈ విజయానికి కారణమని తెలిపారు. సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అంచెలంచెలుగా ఎదిగి చరిత్ర సృష్టించిందన్నారు. గతంలో పార్టీకి ప్రాతినిధ్యం లేకపోయినా ప్రజల మద్దతుతో భారీ విజయాన్ని సాధించడం విశేషమన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలు, అభివృద్ధి లోపం ప్రజల తీర్పులో ప్రతిఫలించాయని పేర్కొన్నారు.
రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకుంటున్నారని తెలిపారు. ప్రజలకు వ్యతిరేకంగా పనిచేసిన వారికి ఎన్నికల్లో గుణపాఠం చెప్పారన్నారు. రానున్న ఎన్నికల్లో మరింత మెజారిటీ సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో యడ్లపాటి స్వరూప రాణి, కొత్తూరు వెంకట సుబ్బారావు, ఈదర శ్రీనివాస్ రెడ్డి, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, వైవి సుబ్బారావు, చరక కుమార్ గౌడ్, బజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, నడ్డి నాగమల్లేశ్వరి యాదవ్, కాయితీ ప్రదీప్ రెడ్డి, చాగంటి హరి పావని, మేకల లక్ష్మణ్, జంధ్యాల రామలింగ శాస్త్రి, రాచుమల్లు భాస్కర్, మంత్రి సుగుణ, కత్తి మేరీ సరోజినీ, క్రిష్టిపాటి నారాయణరెడ్డి, తుంగ యశ్వంత్, కొర్ర శ్రీను నాయక్, షేక్ సాంబశివరావు, దారా అంబేద్కర్, అనుమోలు ఏడుకొండల గౌడ్, కోలా రేణుకాదేవి, వాణి వెంకట్, స్వప్న, వెంకటేష్ యాదవ్, పోతురాజు వెంకట్, తంగా లక్ష్మణరావు, రావుల రాజశేఖర్, శేగు వెంకట నరేష్, మల్లాల లక్ష్మణ్ గౌడ్, కంచర్ల రాజేష్, సురేష్, దుర్గాప్రసాద్, పురుషోత్తం, గౌస్ పీరా, జితేంద్ర గుప్తా, పద్మనాభం, కారంశెట్టి రమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు జిల్లా కీలక ప్రాజెక్టుకు రాష్ట్రం అనుమతి

- గుంటూరు ఛానల్ ఆధునికీకరణకు రూ. 369.20 కోట్ల మంజూరు
- కేంద్రమంత్రి.పెమ్మసాని వెల్లడి
- 33 వేల ఎకరాలకు పైగా ఆయకట్టుకు స్థిరీకరణ
- 33 గ్రామాలు, 4 లక్షలకు పైగా ప్రజలకు ఆసరా





**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న గుంటూరు జిల్లా ప్రజల కల సాకారమయింది. 33 వేల ఎకరాల ఆయకట్టుకు, 33 గ్రామాల ప్రజలకు ఆసరాగా మారుతుంది. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు ఛానల్ ఆధునికీకరణ ప్రతిపాదనకు సహకరించిన రాష్ట్రప్రభుత్వం రూ. 369.20 కోట్లను మంజూరు చేస్తున్నట్లుగా సోమవారం ప్రకటించింది. దీంతో నీటి సమృద్ధి పెరిగి తాగునీటి వ్యవస్థ వృద్ధి చెందుతూ వ్యవసాయానికి మరింత ఉపయోగపడబోతున్న నేపథ్యంలో గుంటూరు జిల్లా రైతాంగం ఆనందోత్సాహాలు వెలిబుచ్చుతున్నారు.
గుంటూరు జిల్లాలో సాగునీటి వ్యవస్థను బలోపేతం చేసే దిశగా గుంటూరు ఛానెల్ ఆధునికీకరణ పనులకు రూ. 369.20 కోట్ల నిధుల విడుదలకు పరిపాలన అనుమతి లభించింది. కృష్ణా డెల్టా సిస్టమ్‌లో భాగంగా 0 నుండి 47 కి.మీ వరకు లీడింగ్ ఛానల్ మరియు డిస్ట్రిబ్యూటరీలతో కూడిన సమగ్ర అభివృద్ధి పనులకు ఈ నిధులు వినియోగించనున్నారు.
ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ... ఈ ప్రాజెక్ట్ గుంటూరు జిల్లాలో సాగునీటి సరఫరాను మరింత బలోపేతం చేసి, రైతులకు స్థిరమైన నీటి సౌకర్యాలను పెంచుతుందని తెలిపారు. కాలువ ఆధునికీకరణతో నీటి వినియోగ సామర్థ్యం పెరిగి, వ్యవసాయ ఉత్పాదకతకు పెద్ద ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.
ఈ గుంటూరు ఛానల్ ఆధునికీకరణ నిమిత్తం విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తో పాటు పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర. ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు కూడా కృషి చేశారులి
కృష్ణా డెల్టా ప్రాంతంలో నీటి నిర్వహణను మరింత సమర్థవంతంగా మార్చే ఈ ప్రాజెక్ట్, రైతుల జీవనోపాధిని మెరుగుపరచడంలో కీలకంగా మారుతుందని తెలిపారు.
రైతుకు నీరు అందితేనే అభివృద్ధి సాధ్యం... ఈ ప్రాజెక్ట్ ఆ దిశగా కీలక అడుగు" అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్‌ను త్వరితగతిన ప్రారంభించేందుకు కృషి చేస్తామని తెలిపారు. గుంటూరు ప్రాంతానికి ఈ కీలక ప్రాజెక్ట్ మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, విద్య మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కి, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు , రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ , సంబంధిత అధికారులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**ఆధునీకీకరణ వల్ల ఉపయోగాలు**
కృష్ణా నది కుడి ఒడ్డున ప్రకాశం బ్యారేజి పైప్రాంతం నుండి ప్రారంభమయ్యే ఈ కాలువ సుమారు 47 కి.మీ. పొడవుతో తాడేపల్లి, మంగళగిరి, పెదకాకాని, గుంటూరు, చెబ్రోలు, వట్టిచెరుకూరు మరియు ప్రత్తిపాడు మండలాలకు సాగునీరు అందిస్తోంది. ఈ కాలువ ద్వారా సుమారు 27,000 ఎకరాల ఆయకట్టు లాభపడుతోంది.
ప్రస్తుతం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మరియు మంగళగిరి మున్సిపాలిటీతో పాటు 33 గ్రామాలకు తాగునీరు సరఫరా చేయడంలో ఈ కాలువ కీలక పాత్ర పోషిస్తోంది. కాలానుగుణంగా పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకొని, గుంటూరు కాలువ వ్యవస్థను ఆధునీకరించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయబడుతున్నాయి. అదేవిధంగా, సుమారు 30 కి.మీ. విస్తరణ ప్రాజెక్ట్‌ను చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించబడ్డాయి. ఈ విస్తరణ ద్వారా అదనంగా 41 గ్రామాలకు తాగునీరు అందించబడటంతో పాటు సుమారు 50,000 ఎకరాల భూమికి సాగునీరు అందించబడుతుంది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467